# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | మంగళవారం 22-6-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 270 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# ముందు వరుసలో నిలచిన కరోనా యోధులు

# యోగాను వారి రక్షణ కవచంగా చేసుకొన్నారు: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 21:'7వ అంతర్జాతీయ యోగ దినం' సందర్భం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మహమ్మారి కాలం లో యోగ కు ఉన్న పాత్ర ను గురించి తన అభిప్రాయాల ను వ్యక్తం చేశారు. ఈ కఠిన సమయం లో యోగ ప్రజల కు ఒక శక్తి సాధనం గాను, ఆత్మవిశ్వాసాన్ని అందించిన సాధనం గాను తన ను తాను రుజువు చేసుకొంది అని ఆయన అన్నారు.

మహమ్మారి కాలం లో యోగ దినాన్ని మరచిపోవడం అనేది యోగ తమ సంస్కృతి లో అంతర్భాగం కానటువంటి దేశాల కు సులభమైన విషయమే అని, అయితే దానికి బదులు గా, ప్రపంచ స్థాయి లో యోగ పట్ల ఉత్సాహం వృద్ధి చెందింది అని ఆయన అన్నారు.

ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవడం లో దృఢత్వం యోగ తాలూకు ప్రముఖ అంశాల లో ఒకటి. ఎప్పుడైతే మహమ్మారి మన ముందుకు వచ్చిందో, ఆ సమయం లో సామర్థ్యాలు, వనరులు లేదా మానసికంగా దీనికి ఎదురొడ్డి నిలవడానికి ఏ ఒక్కరు తయారు గా లేరు. యోగ ప్రజల కు ప్రపంచమంతటా మహమ్మారి తో పోరాడటానికి ఆత్మవిశ్వాసాన్ని, సామర్థ్యాన్ని పెంచుకోవడం లో సాయపడింది.

కరోనా తో పోరాడడం లో ముందు వరుస లో నిలచిన యోధులు ఏ విధం గా యోగ ను వారి సురక్షా కవచం లాగా మార్చుకొన్నదీ, యోగ మాధ్యమం ద్వారా వారిని వారు బలపరచుకొన్నదీ ప్రధాన మంత్రి వివరించారు. వైరస్ తాలూకు ప్రభావాల బారి నుంచి బయటపడటం కోసం వైద్యులు, నర్సులు కూడా ఏ విధం గా యోగ ను ఆశ్రయించిందీ ప్రధాన మంత్రి గుర్తు కు తెచ్చారు. ఆసుపత్రుల లో వైద్యుల ద్వారా, నర్సుల ద్వారా ఏర్పాటైన యోగ సమావేశాల ను నిర్వహణ తాలూకు ఉదాహరణ లు ప్రతి చోట కనిపించాయి. మనం గాలి ని పీల్చుకొనే, తరువాత అలా పీల్చుకొన్న గాలి ని బయటకు వదలిపెట్టే క్రియల ను పటిష్ట పరచుకోవడం కోసం ప్రాణాయామం, అనులోమం-విలోమం వంటి శ్వాస సంబంధి వ్యాయామాలకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలి అని నిపుణులు నొక్కిచెప్తూ వస్తున్న సంగతి ని ప్రధాన మంత్రి ప్రస్తావించారు.

# జులై 1 నుంచి పల్లె, పట్టణ ప్రగతి : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జూన్ 21: రాష్ట్రంలో గ్రామాలు, పట్టణాలను బాగు చేస్తున్నాం అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలను మరింత బాగు చేసుకునేందుకు జులై 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పది రోజుల పాటు పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, హరితహారం కార్యక్రమం చేపడుతామని సీఎం కేసీఆర్ చెప్పారు. ఈ నెల 26వ తేదీన మినిస్టర్లు, కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, అడిషనల్ కలెక్టర్లు, డీఆర్‌డీవో అధికారులతో సమావేశం ఉంటుంది. ఆ రోజు మొత్తం ఎజెండా ఫైనల్ చేద్దామన్నారు.

ప్రతి గ్రామానికి నర్సరీ ఉంది. ట్రాక్టర్లు వచ్చాయి. మున్సిపాలిటీల్లో అనుకున్నంత అభివృద్ధి జరగడం లేదు. రాజకీయాల్లో నేల విడిచి సాము చేయడం జరుగుతుంది. గ్రామాలు, పట్టణాలు పచ్చదనం, పరిశుభ్రతతో వెలిగిపోవాలి. ఇవి సాధిస్తే.. దానికి మించిన పని లేదు. ప్రతీ గ్రామం అభివృద్ధి చెందుతోంది. ప్రజలకు అవసరమైన సదుపాయాలన్నింటినీ కల్పిస్తున్నాం అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

# సెప్టెంబర్-అక్టోబర్‌లలో కరోనా మూడో వేవ్: ఐఐటీ కాన్పూర్ అధ్యయనం

న్యూఢిల్లీ, జూన్ 21: ఇండియాలో కరోనా సెకండ్ వేవ్ దాదాపు పూర్తి కావచ్చింది. జులైలోపు ఇది మొత్తంగా తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి. అయితే థర్డ్ వేవ్ తప్పదన్న వార్తల నేపథ్యంలో అసలు అది ఎప్పుడు వస్తుందన్నదానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. తాజాగా ఐఐటీ కాన్పూర్ చేసిన అధ్యయనంలో కరోనా మూడో వేవ్ ఇండియాలో సెప్టెంబర్ నుంచి అక్టోబర్ మధ్య ఉండే అవకాశం ఉంది. ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్లయిన రాజేష్ రంజన్, మహేంద్ర వర్మలు తమ టీమ్‌తో కలిసి ఈ అధ్యయనం నిర్వహించారు. ఆ వివరాలను సోమవారం వెల్లడించారు.

రెండో వేవ్ పారామీటర్లను పరిగణలోకి తీసుకొని ఎస్ఐఆర్ మోడల్ ఉపయోగించి థర్డ్ వేవ్ గురించి మూడు రకాల పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నట్లు వీళ్లు చెప్పారు. జులై 15లోపు ఇండియా మొత్తం అన్‌లాక్ అవుతుందని మేము భావిస్తున్నాం. ఆ లెక్కన మొదటి పరిస్థితి (సాధారణ పరిస్థితులు) వస్తే అక్టోబర్‌లో థర్డ్ వేవ్ పీక్ ఉంటుంది. అయితే ఇది సెకండ్ వేవ్ పీక్ అంత ఉండదు. ఇక రెండో పరిస్థితి (వైరస్ మ్యుటేషన్లతో సాధారణ పరిస్థితులు) సెకండ్ వేవ్ పీక్ కంటే ఎక్కువగా ఉండి సెప్టెంబర్‌లోనే రావచ్చు. మూడో పరిస్థితి (కఠిన ఆంక్షలు) చూసుకుంటే మూడో వేవ్ పీక్ అక్టోబర్ చివరి వరకూ ఆలస్యం కావచ్చు. ఇక్కడ సెకండ్ వేవ్ పీక్ కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది.

వీళ్ల అధ్యయనం ప్రకారం మిజోరం, మణిపూర్, సిక్కిం వంటి ఈశాన్య రాష్ట్రాల్లో తప్ప సెకండ్ వేవ్ ముగిసిపోయింది. ప్రస్తుతం పాజిటివిటీ రేటు 5 శాతం లోపే ఉంది. కొన్ని రాష్ట్రాల్లోనే ఇది 10 శాతానికిపైగా ఉంది.

# జయశంకర్ సార్‌ను తలుచుకుంటే తెలంగాణకు బర్కత్ : సీఎం కేసీఆర్



వరంగల్, జూన్ 21:తెలంగాణ సిద్ధాంతకర్త , ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా సీఎం కేసీఆర్ ఆయనను స్మరించుకున్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడారు. జయశంకర్ సార్ చాలా గొప్ప వ్యక్తి. ఏడెనిమిది సంవత్సరాలు కలిసి పని చేశాం. సచ్చేదాకా తెలంగాణ సాధించాలనే ఉండే అని జయశంకర్ సార్ చెప్పారు. కానీ తెలంగాణ రాకముందే సార్ చనిపోవడం బాధాకరమైన విషయమన్నారు.

విద్యార్థి దశ నుంచి చివరి దశ వరకు ఒకే నినాదం, సిద్ధాంతం మీదున్న వ్యక్తి జయశంకర్ సార్. ఆయనను ఎంత తలుచుకుంటే అంత తెలంగాణకు బర్కత్ ఉంటుంది. అలాంటి మహనీయుడు పుట్టిన జిల్లా ఈ వరంగల్ జిల్లా. తెలంగాణ ఏర్పడే తరుణంలో నాలుగు నెలల ముందు ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేసి అనేక అంశాలపై చర్చించాం. మిషన్ కాకతీయ పేరును ఆ సమావేశంలోనే నిర్ణయించామన్నారు. జయశంకర్ సార్ ధన్యజీవి. ఆయన ఏదైతే కోరిందో ఇవాళ నెరవేరింది అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

## చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ అహారహము నవపథమ్మున
వివరించుచు చిత్రసీమ వేలేతులుగా
"చెవారం గణేష్ పాత్రో"
సమానముతో సము చితమగు స్థానము నొందెన్!!

( జూన్ 22 సినిమా రచయిత గణేష్ పాత్రో జయంతి...)

-రాధశ్రీ

సెల్: 9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# బోనాల నిర్వహణపై 25న అత్యున్నతస్థాయి సమావేశం : మంత్రి తలసాని

హైదరాబాద్ , జూన్ 21: రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆషాఢ మాస బోనాల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షించేందుకు ఈ నెల 25న మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఓఅఊఖీఆ)లో అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. గతేడాది కరోనా మహమ్మారి కారణంగా బోనాలను నిర్వాహించుకోలేక పోయామని ఆయన గుర్తుచేశారు. "ఈ ఏడాది ఘనంగా ఆషాఢ బోనాలను నిర్వహించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రూ.15 కోట్లు మంజూరు చేశారు. జూలై 11న గోల్కొండ బోనాలు, 25న సికింద్రాబాద్ బోనాలు, ఆగస్టు 1న హైదరాబాదు బోనాల ఉత్సవాలు ఉంటాయి. 25న జరిగే అత్యున్నతస్థాయి సమావేశానికి డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, పోలీస్ కమిషనర్లు అంజనీ కుమార్, మహేష్ భగవత్, సజ్జనార్, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారు" అని మంత్రి తలసాని పేర్కొన్నారు.

# ఈ ఏడాది మోదీ సర్కార్ ప్రైవేటీకరిస్తున్న బ్యాంకులు ఇవే!

న్యూఢిల్లీ, జూన్ 21:రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు రంగం సిద్ధమైంది. దీనికోసం వచ్చే వర్షాకాల సమావేశాల్లో బ్యాంకింగ్ రెగ్యులేషన్స్ అండ్ బ్యాంకింగ్ లా చట్టానికి కేంద్ర ప్రభుత్వం సవరణలు చేయనుంది. సీఎన్‌బీసీ ఆవాజ్ మీడియా సంస్థ వెల్లడించిన దాని ప్రకారం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లను ప్రైవేటీకరించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు బ్యాంకులను ప్రైవేటీకరిస్తామని గత యూనియన్ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించిన విషయం తెలిసిందే.

ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కొత్త ప్రభుత్వ రంగ సంస్థల విధానం ప్రకారం ప్రైవేటీకరణ, విలీనం చేయాల్సిన సంస్థల వివరాలను నీతి ఆయోగ్ సిఫార్సు చేయనుంది. ఈసారి ఈ రెండు బ్యాంకులను ప్రైవేటీకరించాల్సిందిగా నిర్ణయించినట్లు సమాచారం. కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలోని ప్రభుత్వ శాఖ కార్యదర్శుల గ్రూపు వీటికి ఆమోదం తెలిపిన తర్వాత ఆల్టర్నేటివ్ మెకానిజం ముందుకు నివేదిక వెళ్తుంది. చివరికి కేబినెట్ ఆమోదం కోసం పంపుతారు.

# జులై-ఆగస్ట్ నాటికి వ్యాక్సినేషన్ వేగవంతం : అమిత్ షా

అహ్మదాబాద్, జూన్ 21:: దేశవ్యాప్తంగా జులై- ఆగస్ట్ మాసాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 18 ఏండ్లు పైబడిన వారికి ఉచిత వ్యాక్సినేషన్‌ను ప్రకటించడం ద్వారా మనం దాదాపు ప్రతి ఒక్కరికీ వ్యాక్సినేషన్ పూర్తిచేయాలనే లక్ష్యాన్ని సత్వరమే చేరుకుంటామని చెప్పారు. భారీ జనాభా కలిగిన దేశంలో ఉచిత వ్యాక్సినేషన్ సమకూర్చడం పెద్ద నిర్ణయమని అమిత్ షా అన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు దేశమంతటా ఉచిత వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భారత్ ఇప్పటికే అగ్ర భాగాన ఉన్నదని అమిత్ షా పేర్కొన్నారు. మనం ప్రస్తుతం మనం పౌరులందరికీ వ్యాక్సినేషన్ పూర్తి చేసే లక్ష్యానికి చేరువగా వెళుతున్నామని అన్నారు.

# భారీగా దిగివచ్చిన తాజా కేసులు : 0.17 శాతానికి తగిన పాజిటివిటీ రేటు

న్యూఢిల్లీ, జూన్ 21:: కరోనా సెకండ్ వేవ్‌తో తల్లడిల్లిన దేశ రాజధాని ఢిల్లీ మహమ్మారి నుంచి తేరుకుంది. గత కొద్దిరోజులుగా కరోనా కేసులు భారీగా తగ్గుముఖం పట్టగా తాజాగా ఢిల్లీలో కేవలం ఈ ఏడాదిలో అత్యంత కనిష్టంగా 89 కేసులు నమోదయ్యాయి. ఢిల్లీలో పాజిటివిటీ రేటు అత్యల్పంగా 0.17 శాతానికి పడిపోయింది.

ఇక మహమ్మారి బారినపడి గత 24 గంటల్లో 11 మంది మరణించారు. ఈ ఏడాది జనవరి నుంచి తాజా పాజిటివ్ కేసుల సంఖ్య రెండంకెలకు చేరుకోవడం ఇది రెండోసారి. తాజా కేసులతో ఢిల్లీలో కరోనా వైరస్ కేసుల సంఖ్య 14,32,381కి చేరగా మరణాల సంఖ్య 24,925కి ఎగబాకింది. ఢిల్లీలో కరోనా వైరస్ నుంచి కోలుకునే రోగుల సంఖ్య పెరగడంతో రికవరీ రేటు గరిష్టంగా 98.12 శాతానికి పెరిగింది.

# జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిస్తాం : మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ , జూన్ 21: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా రవీంద్రభారతి ఆడిటోరియంలో ఆయన చిత్రపటానికి మంత్రి నివాళులర్పించి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణ భావజాల వ్యాప్తికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిస్తున్నదని అన్నారు. ఆచార్య జయశంకర్ సార్ సేవలకు గుర్తుగా వ్యవసాయ యూనివర్సిటీకి, భూపాలపల్లి జిల్లాకు ఆయన పేరు పెట్టి గౌరవించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి కేస్ శ్రీనివాస రాజు, చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, జయప్రకాశ్ విద్యాసంస్థల చైర్మన్ రవికుమార్, టీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధీప్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గూడ అంజయ్య ఆశయాలను సాధిస్తున్నాం : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జూన్ 21: ప్రముఖ గేయ కవి, కథా రచయిత గూడ అంజయ్య వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఘన నివాళులర్పించారు. అంజయ్య సేవలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. సబ్బండ వర్గాల జీవన తాత్వికతకు, సాంస్కృతిక చైతన్యానికి గూడ అంజయ్య పాట చిరునామాగా నిలిచిందని సీఎం అన్నారు. ఉద్యమ కాలంలో తెలంగాణ భావజాల వ్యాప్తికి, పాట ద్వారా దివంగత గూడ అంజయ్య చేసిన ఉద్యమ కృషిని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ స్వయం పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతకాలనే గూడ అంజయ్య ఆశయాలను, తెలంగాణ ప్రభుత్వం నిజం చేసి చూపిస్తున్నదని సీఎం తెలిపారు. ఆ దిశగా పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, తెలంగాణ సబ్బండ వర్గాల అభివృద్ధికి పాటు పడుతున్నదని, తద్వారా గూడ అంజయ్యకు ఘన నివాళి అర్పిస్తున్నామని, సీఎం పేర్కొన్నారు.

# కరోనా వ్యాక్సినేషన్‌లో కొత్త రికార్డు.. ఒకే రోజు అత్యధిక వ్యాక్సిన్లు

న్యూఢిల్లీ: కరోనా వ్యాక్సినేషన్ కొత్త విధానం అమల్లోకి వచ్చిన రోజే ఇండియా కొత్త రికార్డును అందుకుంది. రోజువారీ వ్యాక్సినేషన్లలో గత రికార్డును అధిగమించింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకూ దేశంలో 47.5 లక్షల డోసుల వ్యాక్సిన్లు ఇచ్చారు. ఒక రోజులో ఇచ్చిన అత్యధిక వ్యాక్సిన్ డోసుల రికార్డు ఇదే కావడం గమనార్హం. ఇంతకుముందు రోజులో అత్యధిక వ్యాక్సిన్ల రికార్డు 43 లక్షలుగా ఉంది. ఐదు బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్, హర్యానాల్లో వ్యాక్సిన్ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు.

దీంతో సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకే ఈ రాష్ట్రాల్లో 23 లక్షల డోసుల వ్యాక్సిన్ ఇచ్చారు. సోమవారం నుంచి దేశవ్యాప్తంగా 18 ఏళ్లు నిండిన అందరికీ కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా వ్యాక్సిన్ ఇస్తున్న విషయం తెలిసిందే. ఇక జులై, ఆగస్ట్‌లో దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగాన్ని పెంచాలని నిర్ణయించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. అందరికీ ఫ్రీ వ్యాక్సిన్ అన్న మోదీ నిర్ణయంతో ఇక దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగం పుంజుకోనున్నట్లు చెప్పారు.

# మల్టీ సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన



వరంగల్,జూన్ 21:వరంగల్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన మల్టీ సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇవాళ వరంగల్ జిల్లా పర్యటనకు వెళ్లిన సీఎం దవాఖాన నిర్మాణానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి భూమిపూజ చేశారు. వరంగల్ కేంద్ర కారాగారాన్ని అక్కడి నుంచి తొలగించి ఆ స్థలంలో ప్రభుత్వం దవాఖాన నిర్మించాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తం 60 ఎకరాల్లో 24 అంతస్తులతో సకల హంగులతో ఈ దవాఖానను నిర్మించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. 2 వేల పడకల సామర్థ్యం, 35 సూపర్ స్పెషాలిటీ విభాగాలతో పూర్తి ఆధునిక వసతులతో దవాఖాన నిర్మించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. 24 అంతస్తుల భవనంపై హెలిప్యాడ్‌ను సైతం ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు.

# వరంగల్ అర్బన్ జిల్లా పేరు మార్పు.. సీఎం కేసీఆర్ ప్రకటన

వరంగల్,జూన్ 21: వరంగల్ అర్బన్ జిల్లా పేరును మార్చుతున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానికుల విజ్ఞప్తుల మేరకు వరంగల్ అర్బన్ జిల్లా పేరును హన్మకొండ జిల్లాగా మార్చుతామని సీఎం పేర్కొన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టరేట్ భవనం ప్రారంభం సందర్భంగా సీఎం కేసీఆర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇవాళ ప్రారంభించుకున్న కలెక్టరేట్ భవనాన్ని హన్మకొండ జిల్లాగా పరిగణించాలి. దీనికి సమీపంలో నిర్మించబోయే కలెక్టరేట్‌ను వరంగల్ కలెక్టరేట్‌గా పరిగణించాలి. పేరు మార్పునకు సంబంధించిన ఉత్తర్వులు రెండు, మూడు రోజుల్లోనే వస్తాయని సీఎం తెలిపారు.

అధునాతన జిల్లా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది అని సీఎం కేసీఆర్ తెలిపారు. వరంగల్ నాయకులు, ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పరిపాలన సంస్కరణలు బాగా తెచ్చుకున్నాం. అవన్నీ పరిపుష్టం కావాలి. అప్పుడే అనుకున్న ఫలితాలు వస్తాయి. ప్రభుత్వం అంటే ప్రజలకు ఇబ్బంది కలగనప్పుడే నిజమైన పరిపాలన అని అన్నారు. పనులు వేగంగా జరిగితేనే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుంది అని సీఎం కేసీఆర్ చెప్పారు.

# వరంగల్ ప్రజలకు ఇవాళ సుదినం : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, జూన్ 21: వరంగల్ ప్రజలకు ఇవాళ సుదినం.. కేసీఆర్ మనకు సీఎం కావడం మనం ఒక అదృష్టంగా భావించాలి అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడారు. వరంగల్ జిల్లా ప్రజల మనసులో ఏముందో సీఎం కేసీఆర్‌కు తెలుసు. ఈ జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎన్నో చర్యలు తీసుకుంటున్నారు. మహారాష్ట్రలో అక్రమ ప్రాజెక్టులు కట్టి వరంగల్ జిల్లాకు రావు అనుకున్నాం. కానీ కాళేశ్వరం ద్వారా దేవాదులకు సాగునీరు అందిస్తున్నారు. రైతుల తరపున పాదాభివందనం చేస్తున్నాను. రైతుల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. గ్రామాలు బాగు చేసేందుకు సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారు. గ్రామాల రూపురేఖలు మారిపోయాయి.

సీఎం కేసీఆర్ ఆశయాల మేరకు వరంగల్ పట్టణాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. వరంగల్ ఎంజీఎంను అభివృద్ధి చేస్తున్నారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి భూమిపూజ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ హాస్పిటల్ పూర్తయితే సమీప జిల్లాల ప్రజలకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉందన్నారు. ఒకప్పుడు ఆఫీసుల చుట్టూ తిరగలేక సచ్చేది. కానీ నేడు అన్ని కార్యాలయాలు ఒకే వద్ద నిర్మించడం గొప్ప విషయమన్నారు. దయచేసి వరంగల్ అర్బన్ జిల్లా పేరును మార్చాలని ఎర్రబెల్లి దయాకర్ రావు విజ్ఞప్తి చేశారు.

# ఊహాకందని విధంగా రాష్ట్రాభివృద్ధి : మంత్రి సబిత



వికారాబాద్, జూన్ 21:: వికారాబాద్ జిల్లా నూతన సమీకృత కార్యాలయ భవన సముదాయాన్ని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఊహలకందని విధంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. నూతన గ్రామ పంచాయతీ లు, మండలాలు, రెవెన్యూ డివిజన్, నూతన జిల్లాలు, జోన్లతో పరిపాలన ప్రజలకు మరింత చేరువైందన్నారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాల నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయాల సముదాయం పనులు దాదాపు పూర్తయ్యాయి. సీఎం చేతుల మీదుగా త్వరలో ప్రారంభిస్తామన్నారు. నూతన కలెక్టర్ కార్యాలయ సముదాయం వద్ద పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్లకు కూడా ఈ సముదాయంలోనే గృహాలు నిర్మిస్తామన్నారు. అలాగే నూతన కలెక్టరేట్‌ను పరిశీలించి మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్ రెడ్డి, కొప్పుల మహేష్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, కలెక్టర్ పౌసమి బసు, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీ కృష్ణ, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, అడిషనల్ కలెక్టర్లు చంద్రయ్య, మోతీలాల్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల పాల్గొన్నారు.

# కేసీఆర్ పర్యటనలో నర్సంపేట ఎమ్మెల్యేకు అవమానం

హైదరాబాద్ , జూన్ 21:తెలంగాణ సీఎం కేసీఆర్ వరంగల్ పర్యటనలో అధికార పార్టీ ఎమ్మెల్యే పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఈ మేరకు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. సీఎం పర్యటనలో పాల్గొనేందుకు వస్తున్న పెద్ది సుదర్శన్ రెడ్డి వాహనాన్ని కేయూ క్రాస్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. హెడ్ క్వార్టర్స్ వద్దే పోలీసులు తన వాహనాన్ని నిలిపివేయడంతో ఎమ్మెల్యే మనస్తాపం చెందారు. దీంతో అక్కడి నుండి మినిస్టర్ క్వార్టర్స్ కార్యాలయం వరకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నడుచుకుంటూ వెళ్లారు. కాగా పోలీసుల తీరును నిరసనగా అధికార పార్టీ ఎమ్మెల్యే పాదయాత్ర చేయడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# ప్రమాణ స్వీకారం చేసిన నలుగురు నూతన ఎమ్మెల్సీలు



అమరావతి, జూన్ 21: గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన నలుగురు వైసీపీ అభ్యర్థులు లేళ్ల అప్పిరెడ్డి, తోట త్రిమూర్తులు, మోషేన్‌రాజు, రమేష్ యాదవ్‌లు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలో సోమవారం ఉదయం ఈ కార్యక్రమం జరిగింది. ప్రొటెం ఛైర్మన్ బాలసుబ్రహ్మణ్యం నూతన ఎమ్మెల్సీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు శ్రీ రంగనాథరాజు, అనిల్ కుమార్ యాదవ్, తానేటి వనిత, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు పాల్గొన్నారు. గవర్నర్ కోటా కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నలుగురు ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఇటీవల ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

# శాసన మండలిని రద్దు చేయాలని సీఎం జగన్‌కు రఘురామ లేఖ

అమరావతి, జూన్ 21:గత కొన్నిరోజులుగా సీఎం జగన్‌కు వరుసగా లేఖాస్త్రాలు సంధిస్తున్న వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణంరాజు సోమవారం నాడు మరో లేఖ పంపారు. శాసనమండలిని రద్దు చేయాలని ఏపీ సీఎం జగన్‌కు ఎంపీ రఘురామ కృష్ణంరాజు లేఖ రాశారు. మెజారిటీ ఉన్నప్పుడు మండలిని రద్దుచేస్తే చిత్త శుద్ధిని ప్రజలు నమ్ముతారని అన్నారు. మెజారిటీ లేనప్పుడు మండలి రద్దుకు చేసిన తీర్మానం ప్రజల్లో సందేహాలు లేవనెత్తిందన్నారు. మండలిలో మెజారిటీ సాధించిన తర్వాత రద్దు చేస్తే ప్రజల్లో సీఎం జగన్ గౌరవం పెరుగుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు.

మండలి కొనసాగించడం వృధా అవుతుందని సీఎం జగన్ చెప్పిన మాటలను నమ్మాలంటే తక్షణమే శాసనమండలిని రద్దు చేయాలని రఘురామ కృష్ణంరాజు ఆ లేఖలో పేర్కొన్నారు. క్రమశిక్షణ గల పార్టీ కార్యకర్తగా మండలి రద్దుకు పార్లమెంట్‌లో ప్రయత్నిస్తానని రఘురామ అన్నారు. సీఎం జగన్ విలాసాలకు రూ. 26 కోట్లు ఖర్చు చేశారని గిట్టనివారు చెబుతున్నారని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# భారీ విదేశీ పెట్టుబడులపై ఏపీ సర్కారు దృష్టి

అమరావతి, జూన్ 21:రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చి, వేలాది మందికి ఉపాధి కల్పించే దిశగా ఏపీ ప్రభుత్వం మరింత వేగంగా అడుగులు వేస్తోంది. సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీ ఈడీబీ) వివిధ దేశాల ప్రతినిధులతో చర్చలు జరపడం ద్వారా రూ.34,813 కోట్ల విలువైన పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. వీటి ద్వారా 60వేల మందికిపైగా ఉపాధి లభించింది. తాజాగా రాష్ట్రంలో అవకాశాలను వివరిస్తూ విదేశీ పెట్టుబడులను ఆకర్షించే విధంగా వర్చువల్‌గా రోడ్‌షోలు, డిప్లొమాటిక్ సమావేశాలు అక్టోబర్ నుంచి నిర్వహించడానికి ఏపీ ఈడీబీ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఇప్పటికే జపాన్, అమెరికా, తైవాన్, దక్షిణ కొరియా, ఇటలీ, మిడిల్ ఈస్ట్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కువైట్ వంటి దేశాల రాయబారులు, వ్యాపార సంఘాలతో సమావేశాలను ఏయే నెలల్లో నిర్వహించాలన్న దానిపై ఒక ప్రణాళికను రూపొందించింది. అక్టోబర్‌లో జపాన్, నవంబర్‌లో అమెరికా, డిసెంబర్‌లో తైవాన్, దక్షిణకొరియా దేశాల ప్రతినిధులతో చర్చలు జరగనున్నాయి. మిగిలిన దేశాలతో వచ్చే ఏడాది ప్రారంభంలోనే చర్చలు జరుగుతాయి. వీటితోపాటు మరో 16 దేశాలకు సంబంధించి సంప్రదింపులు జరుపుతోంది. మొత్తం 25 దేశాల్లో 30 వ్యాపార సంఘాలతో కలిసి రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను తెలియజేయనున్నట్లు ఏపీ ఈడీబీ సీఈవో జవ్వాది సుబ్రమణ్యం వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి ఆధారిత ప్రయోజనాలు (పీఎల్ఐ) స్కీం కింద తయారీ రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న తరుణంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి రంగాల వారీగా ఈడీబీ బృందాలను ఏర్పాటు చేసి కరోనా సమయంలోనూ వెబినార్ ద్వారా సమావేశాలను నిర్వహిస్తోంది.

# కొరియన్ ద్వీపకల్పాన్ని అణ్వాయుధ రహితంగా చేసేందుకు సిద్ధం: యూఎస్

న్యూఢిల్లీ, జూన్ 21:అమెరికాతో చర్చలకైనా, యుద్ధానికైనా సిద్ధంగా ఉండాలంటూ ఉత్తరకొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ తమ దేశ సైన్యానికి సూచనలు చేశారు. దీనిపై అమెరికా స్పందించింది. ఉత్తరకొరియాతో అమెరికా చర్చలకు సిద్ధంగా ఉందని అధ్యక్షుడు జో బైడెన్ కార్యవర్గం ఇప్పటికే స్పష్టం చేసిందని చెప్పారు. కొరియన్ ద్వీపకల్పాన్ని పూర్తిగా అణ్వాయుధ రహితంగా చేసేందుకు అమెరికా ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. జో బైడెన్ ప్రభుత్వం దౌత్య సంబంధాలను పునరుద్ధరించాలని భావించగా అందుకు మొదట కిమ్ సర్కారు ఆసక్తి చూపలేదు. ఇప్పుడు మాత్రం చర్చలు అనే పదాన్ని వాడారు. దీనిపై అమెరికా స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కిమ్ తీరుపై అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సలైవాన్ మాట్లాడుతూ? ఆయన చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా ఉన్నాయని, అయితే, చర్చల విషయంలో బలమైన వేదిక కోసం మరింత స్పష్టమైన సంకేతాలు వచ్చే వరకు వేచిచూస్తామని తెలిపారు.

# వయోవృద్ధులను వేధింపులకు గురి చేసిన లాక్‌డౌన్లు

కోవిడ్-19 రెండవ వేవ్ కారణంగా దేశంలోని 35.1 శాతం వయోవృద్ధులు గృహ హింస, ఛీత్కారాలు, వేదింపులకు గురి అవుతున్నారని ఇటీవల 'ఏజ్‌వెల్ ఫౌండేషన్' తాజాగా విడుదల చేసిన సర్వే నివేదిక తెలియజేస్తున్నది. సంస్థ నిర్వహించిన సర్వేలో 73 శాతం వయోవృద్ధులు కరోనా లాక్‌డౌన్ కాలంలో కుటుంబ సభ్యులు, సమాజం నుంచి చిన్నతూపు, నిరాధరణ, దుర్భాషలు ఎదుర్కొంటున్నామని తెలియజేయడం అత్యంత విచారకరం. కరోనా రెండు అలల నడుమ బిక్కుబిక్కుమంటూ, సామాజిక దూరాలు, గృహ నిర్బంధాల నడుమ పలు అవమానాలను అనుభవించారని, కరోనా సోకినపుడు పడే బాధ కన్న కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు సమాజం నుంచి అవమానాలను పలు రెట్లు అధికంగా ఎదుర్కొన్నామని తెలియజేశారు. ఏజ్‌వెల్ ఫౌండేషన్ నిర్వహించిన సర్వేలో 5,000 మంది వయోవృద్ధుల అభిప్రాయాలను క్రోడీకరించడం జరిగిందని, వీరిలో 82 శాతం మంది కోవిడ్-19 విపత్తు వల్ల తీవ్ర మానసిక శారీరక క్షోభను అనుభవించారని నిర్వాహకులు తెలిపారు.

కరోనా పూర్వపు స్థితితో పోల్చితే కోవిడ్-19 కల్లోలంలో వయోవృద్ధులు స్వయంగా అతి జాగ్రత్తలు తీసుకుంటున్న వేళ కుటుంబ సభ్యుల నిరాధరణ, నిర్లక్ష్య ధోరణితో మానసికంగా బాగా కుంగి పోయారని తెలుస్తున్నది. ఇలాంటి సమాజ నిరాధరణకు కారణంగా కుటుంబ మరియు సాధారణ మానవ సంబంధాలు బలహీణ పడడమే కారణమని 61 శాతం వయోవృద్ధులు అభిప్రాయపడ్డారు. కుటుంబ సభ్యుల నుండి 58 శాతం వయోవృద్ధులు ఛీత్కారాలను ఎదుర్కొనడం జరిగింది. కరోనా మహా విపత్తు కాలంలో అత్యధికంగా భయపడిన వర్గం

('ఏజ్‌వెల్ ఫౌండేషన్' తాజా నివేదిక ఆధారంగా)

వయోవృద్ధులే అని, వారిని రక్షించాల్సిన, ఆదరించాల్సిన బాధ్యత కుటుంబ మరియు ఇరుగు పొరుగు సమాజానిదని గమనించాలి. కరోనా మహమ్మారి అకాలంలో వయోవృద్ధులకు వెన్నుదన్నుగా మనందరం ఉండాలని, వారిని అన్ని విధాల ఆదరించాలని, న్యాయ రక్షణ సూచనలు, హక్కుల పరిరక్షణ సలహాలు అందించాలని, శారీరక ఆరోగ్య భద్రత అందించడానికి సమాజం మానవీయతను ప్రదర్శించాలని సంస్థ ఛైర్మన్ హిమాన్షు రథ్ తెలిపారు. ఈ కరోనా కల్లోల కాలంలో వృద్ధులు, ముఖ్యంగా వృద్ధ మహిళలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో గృహ హింస, తిట్లు, ఛీత్కారాలు, వేదింపులు, నిరాదరణలకు లోను కావడం విచారకరమని, నిన్నటి తరాన్ని కాపాడుకుంటూ, రేపటి ప్రగతికి నేటి వృద్ధుల అనుభవాలను జోడిస్తూ, కరోనాకు దూరంగా, ప్రేమకు దగ్గరగా పసి పిల్లల్లా చూసుకోవలసిన సందర్భమిదని సమాజం కళ్ళు తెరిచి, వృద్ధులను పువ్వుల్లో పెట్టుకొని చూసుకోవాలని ఆశిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఫ్లీట్ అవార్డుల వేడుక- తూర్పు నావల్ కమాండ్ కార్యాచరణ విజయాలకు గుర్తింపు

న్యూఢిల్లీ, జూన్ 21:గత ఏడాది తూర్పునౌకాదళ కార్యకలాపాల విజయాల వేడుకను జరుపుకునేందుకు 19 జూన్ 21న ఫ్లీట్ అవార్డ్స్ ఫంక్షన్ 2021ను నిర్వహించారు. తూర్పు నౌకాదళ కార్యాచరణ కాలచక్ర పరిసమాప్తిని, తూర్పు నావల్ కమాడ్ (ఇఎన్‌సి) స్వోర్డ్ ఆర్మ్ విజయాలను గుర్తింపు చిహ్నం ఫ్లీట్ అవార్డుల వేడుక. తూర్పు నైకాదళ కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్ రేర్ అడ్మిరల్ తరుణ్ సోబ్తి వీఎస్ఎం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎవిఎస్ఎం, విఎస్ఎం,ఇన్‌సి ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ అజేంద్ర బహదూర్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

గత ఏడాదితో పోలిస్తే ఈ ఫ్లీట్ అవార్డుల కార్యక్రమాన్ని నిరాడంబరంగా, పూర్తి స్థాయి కోవిడ్ ప్రోటోకాళ్లను అనుసరిస్తూ జరిగాయి. సముద్ర సంబంధ కార్యకలాపాల పూర్తి వర్ణపటాన్ని గుర్తిస్తూ పదహారు విశిష్ట ట్రోఫీలను అందించడంతో ఈ వేడుక పూర్తయింది.

తూర్పు నౌకాదళంలో ఐఎన్ఎస్ సహ్యాద్రి ఉత్తమ నౌకగా గుర్తింపు పొందగా, సవాళ్ళతో కూడిన అనేక మిషన్లను చేపట్టినప్పుడు మొక్కవోని స్ఫూర్తిని, పట్టుదలను ప్రదర్శించినందుకుకాపిటల్ (యుద్ధ, విమానాలను రవాణా) నౌక ఐఎన్ఎస్ కామోర్తాను, చిన్న యుద్ధనౌకలు అటువంటి రకపు నౌకలలో ఐఎన్ నౌకలు కిల్తాన్, ఖుక్రి ఉత్తమ చిన్న యుద్ధనౌకల ట్రోఫీని గెలుచుకున్నాయి.

గడిచిని ఏడాది సన్‌రైజ్ ఫ్లీట్ కు అత్యంత సవాళ్ళతో కూడినది. ప్రపంచాన్ని కోవిడ్ మహమ్మారి పట్టి పీడుస్తున్నప్పటికీ, తూర్పు నౌకాదళం తన కార్యాచరణ బాధ్యతలను నిర్వహిస్తూ, అగ్రశ్రేణి క్రియాశీలక రీతిని కొనసాగించింది. అధిక కార్యాచరణ వేగాన్ని కొనసాగిస్తూ, నౌకాదళ ఓడలు అనేక ఆపరేషన్లు, విన్యాసాలు, మానవీయ సహాయ మిషన్లలో పాల్గొన్నాయి. తూర్పు నౌకాదళ ఓడలు మలబార్ -20, లా పెరౌజ్, పాసెక్స్ వంటి పలు ప్రధాన ద్వైపాక్షిక, బహుళపాక్షిక విన్యాసాలలో వివిధ నావికాదళాలతో కలిసి పాల్గొని, హెచ్ఎడిఆర్ స్టోర్స్ బట్వాడాకు ఆపరేషన్ సహాయం, మిషన్ సాగర్ లను, విదేశాలలో చిక్కుకుపోయిన బారతీయ పౌరులను రక్షిత స్థానాలకు తరలించేందుకు ఆపరేషన్ సముద్ర సేతను నిర్వహించింది. కోవిడ్-19 రెండవ వేవ్‌లో ఆపరేషన్ సముద్ర సేతు ఎవిలో భాగంగా తాము వృత్తిపరమైన, విశ్వసనీయ శక్తి అని నొక్కి చెప్తూ తూర్పు నావికాదళ ఓడలు తూర్పు సముద్ర తీరంలో ఆక్సిజన్ బట్వాడాను పెంచేందుకు ప్రధానమైన మాధ్యమంగా వ్యవహరించి,

# శ్రీనగర్ తో సహా కాశ్మీర్ లోయలో ఉన్న 15 రైల్వే స్టేషన్లు రైల్వే వైఫై వ్యవస్థతో అనుసంధానం

న్యూఢిల్లీ, జూన్ 21:రైల్ వైర్ పేరుతో భారతీయ రైల్వే అందిస్తున్న వైఫై సౌకర్యం కేంద్రపాలిత ప్రాంతమైన కాశ్మీర్ లోని నాలుగు జిల్లా ప్రధాన కేంద్రాలైన శ్రీనగర్, బుడ్గావ్, బనిహాల్ మరియు ఖాజిగుండ్ లలో ఉన్న 15 రైల్వే స్టేషన్లలో అందుబాటులోకి వచ్చింది. బారాములా, హమ్రే, పట్టన్, మజోమ్, బుద్గామ్, శ్రీనగర్, పాంపూర్, కాకాపోరా, అవంతిపుర, పంజ్‌గం, బిజ్‌బెహారా, అనంత్‌నాగ్, సాదురా, ఖాజిగుండ్, బనిహాల్ రైల్వే స్టేషన్లలో రైల్ వైర్ వ్యవస్థ ఏర్పాటయింది.

ఇప్పటికే వైఫై జమ్మూ లోని జమ్మూ-కతువా, బుధి, చాన్ అరోరియన్, హీరా నగర్, ఘగ్వాల్, సాంబ, విజయపూర్, బారి బ్రాహ్మణ, జమ్మూ తవి, బజల్టా, సంగర్, మన్వాల్, రామ్ నగర్ లోని 15 స్టేషన్లలో అందుబాటులో ఉంది.

రైల్వే స్టేషన్లలో ప్రజలకు వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చే బాధ్యతను రైల్ టెల్ కు రైల్వే శాఖ అప్పగించింది. డిజిటల్ సౌకర్యాల కల్పనకు రైల్వే ప్లాట్‌ఫామ్‌ను వేదికగా చేయాలన్న లక్ష్యంతో ఈ వ్యవస్థకు రూపకల్పన జరిగింది. ప్రస్తుతం దేశంలోని 6000కు పైగా రైల్వే స్టేషన్లలో ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. ప్రపంచంలో అతి పెద్ద సమీకృత వైఫై వ్యవస్థగా ఇది గుర్తింపు పొందింది.

శ్రీనగర్ తో సహా కాశ్మీర్ లోయలోని 15 రైల్వే స్టేషన్ లను రైల్ వైఫై తో అనుసంధానం చేసినట్టు రైల్వే, వాణిజ్య, పరిశ్రమలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్ ప్రకటించారు.

' ప్రజలను ఒక తాటిపైకి తెచ్చే అంశంలో వైఫై కీలకంగా ఉంటుంది. ఇది పట్టణ గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తారతమ్యాన్ని వేగంగా తగ్గిస్తోంది. దేశంలోని అన్ని ప్రాంతాలకు హైస్పీడ్ వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకుని రావడానికి రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సహకారంతో భారతీయ రైల్వేలు కృషి చేస్తున్నాయి. ప్రపంచ వైఫై దినోత్సవం సందర్భంగా కాశ్మీర్ లోయలో శ్రీనగర్ తో సహా 15 రైల్వే స్టేషన్లు 6000కి పైగా రైల్వే స్టేషన్లలో వైఫై సౌకర్యాన్ని అందిస్తూ ప్రపంచంలో అతి పెద్ద ప్రజా వైఫై వ్యవస్థగా గుర్తింపు పొందిన రైల్ వైఫై తో అనుసంధానం అయినట్టు ప్రకటించడానికి నేను సంతోషిస్తున్నాను. దీనితో కాశ్మీర్ లోయలోని అన్ని రైల్వే స్టేషన్లలో వైఫై అందుబాటులోకి వచ్చినట్టు అయ్యింది. డిజిటల్ ఇండియా రూపకల్పనల ఇదో పెద్ద ముందడుగు. ఇది అనుసంధానం కాని వాటిని అనుసంధానం చేస్తుంది. దీనిని సాకారం చేయడానికి భారతీయ రైల్వేలు, రైల్‌టెల్ ను నేను అభినందిస్తున్నాను.' అని ఈ సందర్భంగా ఇచ్చిన సందేశంలో శ్రీ పియూష్ గోయల్ పేర్కొన్నారు.

వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిన భారతీయ రైల్వేలను కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ మంత్రిత్వ శాఖ డాక్టర్ జితేంద్ర సింగ్ అభినందించారు. ప్రజలను ఒకరితో ఒకరిని చేరువలోకి తెచ్చే అంశంలో వైఫై కీలక పాత్ర పోషిస్తున్నదని ఆయన అన్నారు. సమస్యల పరిష్కారానికి డిజిటల్ పరిష్కారాలను వైఫై అందిస్తున్నదని అన్నారు.

కోవిడ్ సమయంలో మానవ సంబంధాలు మరింత మెరుగు పడవలసి ఉన్న ఈ సమయంలో వైఫై ద్వారా రైల్వేలు ఈ పాత్రను నెరవేరుస్తున్నాయని ఆయన చెప్పారు. రైల్ వైర్ వ్యవస్థతో కాశ్మీర్ లోయలోని 15 రైల్వే స్టేషన్లను అనుసంధానం చేయడంతో ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని డాక్టర్ జితేంద్రసింగ్ తన సందేశంలో పేర్కొన్నారు.

ఉత్తమ ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందించడానికి రైల్వే స్టేషన్లలో ఏర్పాటుచేసిన వైఫై సౌకర్యం కేవైసి గల స్మార్ట్‌ఫోన్ గల ఏ వినియోగదారుకైనా అందుబాటులో ఉంటుంది.

ప్రజలను ఒకరితో ఒకరితో కలపడమే కాకుండా ఆవిష్కరణ మరియు అభివృద్ధికి గల అవకాశాలను వైఫై అందుబాటులోకి తెస్తుంది. డిజిటల్ తారతమ్యాన్ని తగ్గించడమే కాకుండా వైఫై సౌకర్యాన్ని అందరికి అందుబాటులో తీసుకుని రావాలన్న నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ వై-ఫై దినోత్సవాలను నిర్వహిస్తున్నారు. భారతదేశంలో పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల మధ్య డిజిటల్ తారతమ్యత ఎక్కువగా ఉంది. తక్కువ కనెక్టివిటీ ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో వైఫై సౌకర్యాన్ని కల్పించే కార్యక్రమంలో భాగంగా పబ్లిక్ వై-ఫై నెట్‌వర్క్ తన సేవలను గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 5000 రైల్వే స్టేషనలలో ఏర్పాటు చేసింది.

దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో పబ్లిక్ వై-ఫైను అందుబాటులోకి తేవడం ద్వారా రైల్వే స్టేషన్లను డిజిటల్ హబ్‌గా మార్చడానికి భారత రైల్వే కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ఇంతవరకు 6021 రైల్వే స్టేషన్లు రైల్‌టెల్ వైఫై సౌకర్యాన్ని కలిగివున్నాయి.

# జాబ్ క్యాలెండర్‌కు నిరసనగా ఏపీ వ్యాప్తంగా ర్యాలీలు



అమరావతి, జూన్ 21:ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఆందోళనలు చేపట్టారు. ఈ మేరకు విద్యార్థి సంఘాలు ర్యాలీలు చేపట్టాయి. విజయనగరంలో విద్యార్థి సంఘాల నేతలు సోమవారం ఉదయం కలెక్టరేట్‌ను ముట్టడించారు. తొలుత విద్యార్థులు కోట కూడలి వద్ద మానవహారం చేపట్టారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో తక్కువ ఉద్యోగాలకు అవకాశమిచ్చారని విద్యార్థులు ఆరోపించారు.

జాబ్ క్యాలెండర్‌కు నిరసనగా ఏపీ వ్యాప్తంగా ర్యాలీలు

మరోవైపు విశాఖలోని జీవీఎంసీ వద్ద నిరుద్యోగ యువత ఆందోళన చేపట్టింది. తక్షణమే మెగా డీఎస్సీ నిర్వహించాలని, అంతేకాకుండా పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని యువకులు డిమాండ్ చేశారు. అటు కర్నూలు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరులోనూ విద్యార్థి సంఘాలు నిరసనకు దిగాయి. ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ సరిగ్గా లేదని నిరుద్యోగులు ఆరోపించారు.

# ఆనందయ్యకు సముచిత గౌరవం.. వరల్డ్ బుక్‌లో చోటు

హైదరాబాద్ , జూన్ 21:దేశంలో లక్షల మంది ప్రాణాలను బలిగొన్న కరోనాకు మందు కనిపెట్టిన కృష్ణపట్నం ఆనందయ్యకు తమ సంస్థ ద్వారా త్వరలో వరల్డ్‌బుక్‌లో చోటు కల్పిస్తున్నట్లు ఇంటర్నేషనల్ బ్రాహ్మిన్స్ పార్లమెంట్(ఐబీపీ) రాష్ట్ర కార్యదర్శి దినవహి వెంకటనాగరాజ ప్రసాద్ ప్రకటించారు. ఆదివారం శ్రీ పొట్టిశ్రీ రాములు నెల్లూరు జిల్లా మనుబోలుకు వచ్చిన ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరోనా నివారణకు మందు కనిపెట్టి ఆనందయ్య చేస్తున్న సేవలను ఐబీపీ గుర్తించిందన్నారు. త్వరలోనే ఆనందయ్యకు, ఆయన్ను ప్రోత్సహించిన ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డికి లండన్ నుంచి రానున్న అవార్డులను నెల్లూరులో అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐబీపీ సభ్యురాలు సునీత ఉన్నారు.

# ప్రతి మహిళ దిశ యాప్ వాడాలి: డీజీపీ సవాంగ్

అమరావతి, జూన్ 21: శనివారం రాత్రి కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఓ యువతిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన అత్యంత హేయకరమని ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను పట్టుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే కృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీలు, విజయవాడ కమిషనర్‌లకు డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

ఇటువంటి అమానవీయ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని డీజీపీ అన్నారు. నేరానికి పాల్పడిన నిందితులు ఎంతటివారైనా ఎట్టి పరిస్థితిలో వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. మహిళల భద్రత తమ ప్రథమ కర్తవ్యమని, ఎన్నో చర్యలు చేపట్టినా, ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మహిళ దిశ యాప్‌ను ఖచ్చితంగా వాడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# కేసీఆర్ కాళ్లు మొక్కిన ఘటనపై కలెక్టర్ వివరణ



సిద్దిపేట, జూన్ 21: కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు తెలంగాణ సీఎం కేసీఆర్ కాళ్లకు నమస్కరించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఆదివారం నాడు సీఎం కేసీఆర్ ఈ రెండు జిల్లాల కలెక్టరేట్ భవనాలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్లను తీసుకెళ్లి వారి ఛాంబర్‌లోని సీట్లలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా సిద్దిపేట కలెక్టర్ వెంకటరామిరెడ్డి సీఎం కేసీఆర్ పాదాలకు నమస్కరించారు. అలాగే, కామారెడ్డిలోనూ కలెక్టర్ శరత్ ఇలానే కేసీఆర్ కాళ్లకు నమస్కరించారు.

సీఎం కేసీఆర్ కాళ్లకు కలెక్టర్లు పాదాభివందనం చేస్తున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సిద్దిపేట కలెక్టర్ వెంకటరామిరెడ్డి స్పందించారు. శుభకార్యం వేళ పెద్దల ఆశీస్సులు తీసుకోవడం తెలంగాణ సంప్రదాయమని, దీనికి తోడు ఆదివారం ఫాదర్స్ డే కూడా కావడంతో కేసీఆర్‌ను తండ్రిలా భావించి ఆశీస్సులు తీసుకున్నట్టు చెప్పారు.

# ఏపీలో ప్రభుత్వ కార్యాలయాలు సాయంత్రం 5 వరకు..

అమరావతి, జూన్ 21:ఏపీలో కరోనా నియంత్రణకు విధించిన కర్ఫ్యూను ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించిన విషయం తెలిసిందే. కాగా కర్ఫ్యూ సడలింపు సమయాన్ని ఉదయం గం.6 నుంచి సాయంత్రం గం.6 వరకూ పెంచారు. సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూను కఠినంగా అమలు చేయనున్నారు. వ్యాపార దుకాణాలను ఐదింటికే మూసివేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగుల పని వేళలు ఇకపై ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని ప్రభుత్వం పేర్కొంది. కాగా కేసులు ఎక్కువ వున్న తూర్పు గోదావరి జిల్లాలో మాత్రం కర్ఫ్యూ సడలింపును మధ్యాహ్నం గం.2 వరకే ఇచ్చారు. దానికి అనుగుణంగా ఆ ఒక్క జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల పని వేళల్ని ఉదయం గం.8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉండేలా ఏర్పాటు చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు ఇవే పని వేళలు వర్తిస్తాయి.

# ప్రశాంత్ కిశోర్ తో మరోసారి భేటీ అయిన శరద్ పవార్

న్యూఢిల్లీ, జూన్ 21:ఎన్సీపీ అధినేత శరద్ పవార్, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ మరోసారి బేటీ అయ్యారు. వారం రోజుల వ్యవధిలో వీరిద్దరూ భేటీ కావడం ఇది రెండోసారి. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయపార్టీలు లేని థర్డ్ ఫ్రంట్ కు రూపకల్పన చేయడంపై వీరిద్దరూ చర్చించినట్టు సన్నిహిత వర్గాలంటున్నాయి. అంతేకాదు, నరేంద్ర మోదీకి దీటైన ప్రధాని అభ్యర్థిని నిలపడంపైనా చర్చలు సాగినట్టు తెలిపాయి.

మోదీకి వ్యతిరేకంగా ప్రధాని అభ్యర్థి రేసులో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పేరు వినిపిస్తోంది. అయితే, దీనికి సంబంధించిన ప్రస్తావన వచ్చినప్పుడు, మమత, మొదట కొవిడ్ పై పోరాడాల్సి ఉందని, ఆ తర్వాతే 2024 ఎన్నికలని తమ తక్షణ ప్రాధాన్యత దేనికో చెప్పారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడమే ప్రధాన అజెండాగా ఈ భేటీలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. తొలుత జూన్ 11న ముంబయిలో శరద్ పవార్ నివాసంలో దాదాపు 3 గంటల పాటు సమావేశం జరగ్గా, తాజాగా ఢిల్లీలో అరగంట పాటు భేటీ అయ్యారు.

ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయపార్టీలు లేని థర్డ్ ఫ్రంట్ కు రూపకల్పన చేయడంపై వీరిద్దరూ చర్చించినట్టు సన్నిహిత వర్గాలంటున్నాయి. అంతేకాదు, నరేంద్ర మోదీకి దీటైన ప్రధాని అభ్యర్థిని నిలపడంపైనా చర్చలు సాగినట్టు తెలిపాయి. కాగా, మోదీకి వ్యతిరేకంగా ప్రధాని అభ్యర్థి రేసులో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పేరు వినిపిస్తోంది. అయితే, దీనికి సంబంధించిన ప్రస్తావన వచ్చినప్పుడు, మమత, మొదట కొవిడ్ పై పోరాడాల్సి ఉందని, ఆ తర్వాతే 2024 ఎన్నికలని తమ తక్షణ ప్రాధాన్యత దేనికో చెప్పారు.

# కరోనా ఎఫెక్ట్.. బ్యాంకులు ఖాళీ

హైదరాబాద్ , జూన్ 21:కరోనా వైరస్ మహమ్మారి చాలా మంది కడుపు కొట్టింది. ఆరోగ్యాన్ని పాడు చేసింది. డబ్బును ఖర్చు పెట్టించింది. ఒకటి కాదు.. రెండు కాదు.. కొన్ని లక్షల మంది ఉపాధి కరవై రోడ్డున పడాల్సిన దుస్థితి వచ్చింది. చాలా మంది పూటగడిచేందుకు, మరికొందరు కరోనాతో పాడైన ఆరోగ్యాన్ని బాగు చేసుకునేందుకు దాచుకున్న డబ్బును బ్యాంకు నుంచి తీసేసుకున్నారు. పిల్లల చదువుకనో.. పెళ్లికనో బ్యాంకుల్లో ఫిక్స్ డ్ డిపాజిట్ చేసిన డబ్బునూ డ్రా చేయాల్సిన పరిస్థితి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఖీఃఎ) గణాంకాల ప్రకారం 25 రాష్ట్రాల్లోని 159 జిల్లాల్లో ఫిక్స్ డ్ డిపాజిట్లు భారీగా తగ్గిపోయాయి.

అందులో తెలంగాణలోని 4 జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 2 జిల్లాలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి (గత ఆర్థిక సంవత్సరం 2020?2021) త్రైమాసికానికి సంబంధించి ఆర్బీఐ ఈ డేటాను విడుదల చేసింది. 2018 ఏప్రిల్ ? జూన్ తో 53 జిల్లాల్లోనే ఎఫ్డీలు తగ్గిపోతే.. ఇప్పుడు దాదాపు మూడు రెట్లయింది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 22 జిల్లాల్లోనే ఎఫ్డీలు తగ్గడం గమనార్హం.

గత ఆర్థిక సంవత్సరం రెండు వరుస త్రైమాసికాల్లో 15 జిల్లాల్లో ఫిక్స్ డ్ డిపాజిట్లు తగ్గాయి. ఈ జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లూ ఉన్నాయి. ఇందులోనూ భద్రాద్రి, జనగామ, కరీంనగర్ సహా దేశంలోని ఏడు జిల్లాల్లో వరుసగా మూడు త్రైమాసికాల పాటు డిపాజిట్లు తగ్గినట్టు ఆర్బీఐ డేటా వెల్లడించింది. మహమ్మారి సమయంలో అవసరాలు పెరగడంతో జనాలు డబ్బును బ్యాంకు నుంచి ఉపసంహరించుకుంటున్నట్టు నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రజల వద్ద నగదు చెలామణి పెరుగుతోందంటున్నారు. 2020 మార్చి 13 నుంచి 2021 మే 21 మధ్య జనం వద్ద ఉన్న నగదులో 5.54 లక్షల కోట్ల పెరుగుదల నమోదైందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో జనం వద్ద చెలామణిలో ఉన్న నగదు రూ.28.62 లక్షల కోట్లకు పెరిగింది.

అంతకుముందు ఆర్థిక ఏడాదితో పోలిస్తే 2020?2021 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో బ్యాంకుల్లో డిపాజిట్లు 5.86 శాతం పడిపోయాయని డేటా తెలిపింది. రూ.14.94 లక్షల కోట్ల నుంచి రూ.14.06 లక్షల కోట్లకు పడిపోయింది. ఇక, డిపాజిట్లు భారీగా తగ్గిన జిల్లాల్లో యూపీవే 23 ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్ లో 21, కర్ణాటక 16, మహారాష్ట్రలో 11 జిల్లాల్లో జనాలు ఫిక్స్ డ్ డిపాజిట్లను డ్రా చేసుకున్నారు. అయితే, అత్యధికంగా డిపాజిట్లను డ్రా చేసిన జిల్లాగా తమిళనాడులోని నాగపట్టణం నిలిచింది. అక్కడ 24 శాతం డిపాజిట్లను జనం బ్యాంకుల నుంచి తీసేసుకున్నారు.

# కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకునే పరిస్థితి రావడం సిగ్గుచేటు: బండి సంజయ్

హైదరాబాద్ , జూన్ 21:కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకునే పరిస్థితి సీఎం కేసీఆర్‌కు రావటం సిగ్గుచేటు అని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విమర్శించారు. కలెక్టర్ తీరుతో దేశంలోని ఐఏఎస్ అధికారులంతా సిగ్గు పడుతున్నారన్నారు. హుజురాబాద్‌లో టీఆర్ఎస్‌కు అభ్యర్థి లేరన్నారు. హుజురాబాద్‌లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని బండి సంజయ్ పేర్కొన్నారు. కోట్లు ఖర్చు పెట్టినా టీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా దక్కదన్నారు. హుజురాబాద్‌లో వార్ వన్ సైడే అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ముఖ్య నేతల సమావేశంలో బండి సంజయ్ పేర్కొన్నారు.

తెలంగాణ నిఖార్సైన ఉద్యమకారుడు ఈటల రాజేందర్ అని ఎంపీ బండి సంజయ్ అన్నారు. మొండి ధైర్యంతో పని చేసే వ్యక్తి ఈటల అని బండి ప్రశంసించారు నిజమైన ఉద్యమకారులు టీఆరెస్ పార్టీలో ఉండరు, ఉండలేరన్న ఆయన.. టీఆరెస్ లో ఉండలేని నేతలే బీజేపీలో చేరుతున్నారని వ్యాఖ్యానించారు. ఇవాళ బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్ కు బండి సంజయ్ ఘన స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రంలో మలిదశ ఉద్యమానికి టి– బీజేపీ పురుడు పోస్తదని బండి సంజయ్ అన్నారు.

# ఏపీలో పోలీస్ కంప్లయింట్స్ అథారిటీ చైర్మన్‌గా జస్టిస్ కనగరాజ్

అమరావతి, జూన్ 21:గతంలో ఏపీ ఎస్ఈసీ పదవికి అత్యంత సమీపంలోకి వచ్చి, వెనుదిరిగిన జస్టిస్ కనగరాజ్ కు ఏపీ ప్రభుత్వం ఓ కీలక పదవి అప్పగించింది. ఆంధ్రప్రదేశ్ పోలీస్ కంప్లయింట్స్ అథారిటీ చైర్మన్ గా జస్టిస్ కనగరాజ్ ను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ కనగరాజ్ ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఏపీ సర్కారు ఈ అథారిటీలో మరో ముగ్గురు సభ్యులను త్వరలోనే నియమించనుంది.కాగా, గతంలో ఎస్ఈసీగా పనిచేసిన నిమ్మగడ్డ రమేశ్ కుమార్ తో వివాదం నేపథ్యంలో ఏపీ సర్కారు ఆయన స్థానంలో జస్టిస్ కనగరాజ్ ను ఎస్ఈసీగా ప్రకటించింది. అయితే హైకోర్టు ఆ నియామకం చెల్లదని చెప్పడంతో నిమ్మగడ్డ రమేశ్ కుమార్ తిరిగి ఎస్ఈసీ బాధ్యతలు చేపట్టారు.

గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో ఏపీ పోలీస్ కంప్లయింట్స్ అథారిటీ ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ అథారిటీకి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి కానీ, రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐఏఎస్), ఆపై ర్యాంకులకు చెందినవారు కానీ చైర్మన్ బాధ్యతలకు అర్హులని పేర్కొంది. చైర్మన్ కు మరో ముగ్గురు సభ్యులు విధి నిర్వహణలో సహకరిస్తారని వివరించింది. నిబంధనలకు అనుగుణంగా ఆయన వేతనాలు, ఇతర సౌకర్యాలు ఉంటాయని వెల్లడించింది. ముగ్గురు సభ్యుల నియామకానికి సంబంధించిన ఆదేశాలు ప్రత్యేకంగా వెలువడతాయని వివరించింది.

# ఏడవ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వెబినార్‌ను ఉద్దేశించి ప్రసంగించిన కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, జూన్ 21:యోగాకు ఇంకా ప్రాచుర్యం కల్పించి, మరింతగా సాధన చేయాల్సిన అవసరం ఉందని 'కేంద్ర రహదారి రవాణా ఉహైవేల శాఖ', 'సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ' మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ చెప్పారు. ఏడవ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వెబినార్‌ను ఉద్దేశించి ప్రసంగించిన కేంద్ర మంత్రి, అన్ని రకాల అనారోగ్యాలను, ఇబ్బందులను ప్రజల జీవితాల నుంచి యోగా తరిమికొడుతుందని అన్నారు. యోగా అంతర్జాతీయీకరణ కోసం, వివిధ భాషల్లో గ్రామ స్థాయిల నుంచి యోగా తరగతులు నిర్వహించాలని గడ్కరీ వెల్లడించారు. ఇందుకోసం వీలైనన్ని సాంకేతికతలు వినియోగించుకోవాలని సూచించారు. యోగా అనేది అనుభూతి చెందగల శాస్త్రమని, అపరిమిత ప్రయోజనాలున్నాయని తెలిపారు.

యోగాను ప్రపంచ సాధనగా ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ మార్చారని, యోగా ప్రయోజనాలు, ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలిసేలా ప్రత్యేకంగా ప్రపంచ దినోత్సవాన్ని ప్రారంభించారని శ్రీ గడ్కరీ వివరించారు.

రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద నాయక్ కూడా వెబినార్‌ను ఉద్దేశించి మాట్లాడారు. తాను ఆయుష్ శాఖ మంత్రిగా ఏడేళ్లు సేవలందించానని, యోగాకు తన జీవితంలో, హృదయంలో ప్రత్యేక స్థానముందని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యోగా సాధకుల అంకితభావంతో, అది నేడు ఇంటి పేరుగా మారిందని మంత్రి అన్నారు. ప్రతి ఒక్కరికి దినచర్యలో యోగా భాగం కావాలని శ్రీ నాయక్ పిలుపునిచ్చారు.

# పరదీప్ పోర్ట్ ట్రస్ట్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

న్యూఢిల్లీ, జూన్ 21:పరదీప్ పోర్ట్ ట్రస్ట్ ఈ రోజు 7 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వర్చువల్ విధానంలో ఘనంగా నిర్వహించింది. పరాదీప్ పోర్ట్ ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ శ్రీ ఎ.కె. బోస్ ద్వీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో పోర్ట్ సీనియర్ డిప్యూటీ కార్యదర్శి శ్రీ ఎస్.కె. హజ్రా చౌదరి, పరదీప్ సెంటర్ ఆఫ్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ గౌరవ కార్యదర్శి సేథి మరియు ఆర్ట్ ఆఫ్ లివింగ్ అధ్యాపకులు శ్రీ తపస్ రంజన్ పాటి పాల్గొన్నారు.

దేశం కోవిడ్–19 సమస్యను ఎదుర్కొంటున్న సమయంలో మానవ శ్రేయస్సు రక్షణకు యోగా బలమైన ఆయధంగా ఉంటుందని అన్నారు. పోర్టు సిఐఎస్ఎఫ్ యూనిట్ క్యాంపస్ లోపల మరియు దాని బ్యారక్స్ వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించింది. స్థానిక ప్రజలలో అవగాహన పెంచడానికి అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రాధాన్యత తెలియజేసే విధంగా బ్యానర్లు, హోర్డింగ్‌లు మరియు ఎలక్ట్రానిక్ బోర్డులను ఏర్పాటు చేశారు. కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు యోగా చేశారు.




# కొత్త ఐ.టి. నిబంధనలపై హక్కుల మండలి ఆందోళనకు భారత్ ప్రతిస్పందన

న్యూఢిల్లీ, జూన్ 21: భారతదేశపు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యంతర మార్గదర్శక సూత్రాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి)కి సంబంధించి రూపొందించిన 2021వ సంవత్సరపు నిబంధనలపట్ల మానవ హక్కుల మండలి ప్రత్యేక విధాన విభాగం వ్యక్తం చేసిన ఆందోళనలపై భారత్ స్పందించింది. ఐక్యరాజ్యసమితి కార్యాలయానికి, జెనీవాలోని ఇతర అంతర్జాతీయ సంస్థలకు అనుబంధించిన భారతీయ పర్మనెంట్ మిషన్ తన ప్రతిస్పందను వ్యక్తం చేసింది. పర్మనెంట్ మిషన్ ఈ మేరకు రాసిన లేఖలో ఈ కింది అంశాలు ఉన్నాయి. :

"మానవ హక్కుల మండలి ప్రత్యేక విధాన విభాగానికి ఐక్యరాజ్యసమితికి, ఇతర అంతర్జాతీయ సంస్థలకు చెందిన భారతీయ పర్మనెంట్ కమిషన్ అభినందనలు తెలుపుతోంది. ఈ ఏడాది జూన్ 11వ తేదీన వెలువడిన ఒ.ఎల్.–ఐ.ఎన్.డి. 8/ 2021 నంబరు కలిగిన ఉమ్మడి సమాచార నివేదిక గురించి ప్రత్యేక ప్రతినిధి ద్వారా ప్రస్తావించడం తమకు దక్కిన గౌరవంగా కమిషన్ పరిగణిస్తోంది. భావప్రకటన, వాక్స్వాతంత్ర్య స్వేచ్ఛా హక్కులకు ప్రోత్సాహం, పరిరక్షణ అన్న అంశాలపై ఈ సమాచార నివేదికను రూపొందించారు. శాంతియుతంగా సమావేశమయ్యే హక్కులు, వ్యక్తిగత రహస్యాల హక్కు వంటి అంశాలపై కూడా ఈ నివేదికను వెలువరించారు. భారతదేశపు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యంతర మార్గదర్శక సూత్రాలు, డిజిటల్ మీడియా నైతిక ప్రవర్తనావళి)కి సంబంధించి 2021వ సంత్సరపు నిబంధనలపై ఒక ప్రకటనను కూడా ఈ సందర్భంగా వెలువరించారు.

కాగా, ఇందుకు సంబంధించిన ముసాయిదా నిబంధనల రూపకల్పన కోసం కేంద్ర ఎలెక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ 2018లో విస్తృత స్థాయిలో అనేక సంప్రదింపులు నిర్వహించినట్టు భారతీయ పర్మనెంట్ కమిషన్ ఈ సందర్భంగా తెలియజేయ దలుచుకుంది. ఈ అంశంపై పలువురు వ్యక్తులు, పౌర సమాజ ప్రతినిధులు, పారిశ్రమల, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో సహా పలువురు భాగస్వామ్య వర్గాలతో చర్చలు నిర్వహించారు. నిబంధనలను తయారు చేసే ముందు ప్రజలనుంచి కూడా అభిప్రాయ సేకరణ జరిగింది. ఆ తర్వాత, వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమావేశం జరిగింది. వివిధ వర్గాలనుంచి అందిన అభిప్రాయాలు, వ్యాఖ్యలపై విపులంగా చర్చించిన మీదటే తుది నిబంధనలు ఖరారయ్యాయి.

భారతీయ ప్రజాస్వామ్య సంప్రదాయాలకు, విలువలకు ఎంతో గుర్తింపు ఉందని కూడా పర్మనెంట్ కమిషన్ ప్రధానంగా స్పష్టం చేయదలుచుకుంది. భావ ప్రకటన స్వేచ్ఛ, వాక్స్వాతంత్ర్య హక్కులకు భారత రాజ్యాంగం పూచీ కల్పిస్తోంది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయవ్యవస్థ, పటిష్టమైన సమాచార సాధనాల వ్యవస్థ భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక భాగాలే.

ఈ నేపథ్యంలో, ఈ లేఖతో జతపరిచిన సమాచారాన్ని సంబంధిత ప్రతినిధుల దృష్టికి తీసుకవెళ్లాలని పర్మనెంట్ కమిషన్ కోరుతోంది. ఇందుకు సంబంధించిన హామీలను గురించి మానవ హక్కుల మండలి ప్రత్యేక విధాన విభాగానికి అత్యున్నత స్థాయిలో మరోసారి వివరించేందుకు ఇది సదవకాశంగా భారతీయ పర్మనెంట్ కమిషన్ పరిగణిస్తోంది."2021వ సంవత్సరపు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యంతర మార్గదర్శక సూత్రాలు, డిజిటల్ మీడియా నైతిక ప్రవర్తనావళి) నిబంధనలను భారత ప్రభుత్వం రూపొందించింది. 2000 సంవత్సరపు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 87(2) ప్రకారం ప్రభుత్వానికి దఖలు పడిన అధికారాలతో ఈ నిబంధలకు రూపకల్పన జరిగింది. 2011వ సంవత్సరపు మార్గదర్శక సూత్రాల స్థానంలో ఈ కొత్త నిబంధనలు రూపకల్పన జరిగింది. 'నూతన ఐ.టి. నిబంధనల' పేరిట ఈ నిబంధనావళిని ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన నోటిఫికేషన్ ద్వారా వెలువరించారు. ఇవే నిబంధనలు మధ్యంతరంగా ఈ ఏడాది మే నెల 26వ తేదీనుంచి అమలులోకి వచ్చాయి. కొత్త ఐ.టి. నిబంధనలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను ఈ అనుబంధంలో కూడా పొందుపరిచారు.

సామాజిక మాధ్యమాలను వినియోగించే సాధారణ వినియోగదారులకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఈ నిబంధనలకు రూపకల్పన చేశారు. సామాజిక మాధ్యమాల దుర్వినియోగం కారణంగా నష్టపోయన బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన ఒక వేదిక ఏర్పాటుకు కూడా ఈ నిబంధనలు వీలు కల్పిస్తాయి.

సామాజిక, డిజిటల్ మాధ్యమ వేదికల దుర్వినియోగం జరుగుతున్న ఉదంతాలు పెరిగిన కారణంగా విస్తృత స్థాయిలో వెలువడిన ఆందోళనల నేపథ్యంలో కొత్త ఐ.టి. నిబంధనలకు రూపకల్పన చేయాల్సి వచ్చింది. ఉగ్రవాదుల నియామకాన్ని ప్రేరేపించడం, అసభ్యకరమైన అంశాల వ్యాప్తి, సామరస్యాన్ని దెబ్బతీసే అంశాలను ప్రచారం చేయడం, ఆర్థిక అవతకలకు పాల్పడటం, హింసను రెచ్చగొట్టడం, శాంతి భద్రతలను దెబ్బతీయడం వంటి వాటికి సామాజిక మాధ్యమాలు దుర్వినియోగం అవుతున్న సంఘటనలు పెరిగిన నేపథ్యంలో ఈ కొత్త నిబంధనలు ఏర్పాటు చేయాల్సిన అగత్యం ఏర్పడింది.

ఇక బాలలపై నీలి చిత్రాల చిత్రీకరణ, ఆన్ లైన్ వేదికలపై ఈ అంశాలను, ఇతరత్రా సమాచారాన్ని ప్రచారం చేయడం వంటి దుష్పరిణామాలను నిర్మూలించాలని సుప్రీంకోర్టు 2018, 2019 సంవత్సరాల్లో వెలువరించిన రెండు తీర్పుల్లో భారత ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2018వ సంవత్సరపు ప్రజ్వల కేసులో, 2019వ సంవత్సరపు ఫేస్ బుక్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఈ తీర్పులు వెలువరించింది. అభ్యంతరకమైన సందేశాలను, అంశాలను మొట్టమొదటగా తయారు చేయడానికి కారకులైన వ్యక్తులు, సంస్థలు, సంఘాలను కనిపెట్టడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం తప్పనిసరి అంటూ రెండవ కేసు తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీనితో ఇందుకు సంబంధించిన సమాచారాన్ని మధ్యవర్తులనుంచి సేకరించడం అవసరంగా మారింది.

సామాజిక మాధ్యమాల వేదికలు భారతీయ చట్టాల కింద జవాబ్దారీగా వ్యవహరించేలా చూసేందుకు న్యాయ వ్యవస్థను మరింత పటిష్టపరచాలని భారతీయ పార్లమెంటు (ఎగువ సభ–రాజ్యసభ) కూడా పదే పదే భారత ప్రభుత్వాన్ని కోరింది.

దీనితో కేంద్ర ఎలెక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలు కలసి 2018లో వివిధ భాగస్వామ్య వర్గాలతో విస్తృత స్థాయిలో సంప్రదింపుల ప్రక్రియను నిర్వహించాయి. వివిధ వ్యక్తులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, పరిశ్రమల, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో ఈ చర్చలు నిర్వహించారు. అనంతరం ప్రజలనుంచి కూడా అభిప్రాయ సేకరణ జరిపి సంబంధిత నిబంధనలను రూపొందించారు. మంత్రిత్వ శాఖల స్థాయిలో కూడా సమావేశాలు నిర్వహించి, వివరంగా చర్చించి, సమావేశాల్లో అందిన అభిప్రాయాలకు అనుగుణంగా నిబంధనలను ఖరారు చేశారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన కొత్త ఐ.టి. నిబంధనలను ఒక నోటిఫికేషన్ ద్వారా వెలువరించారు. మూడు నెలల్లోగా కొత్త నిబంధనలను అనుగుణంగా పనిచేయాలని గడువు విధించారు. కొత్త నిబంధనల ప్రకారం వివాదాల పరిష్కారానికి భారతదేశానికే చెందిన అధికారిని, నోడల్ అధికారిని నియమించుకోవలసి ఉంటుంది. బాధితులు తమ సమస్యను పరిష్కరించుకునేందుకు వీలుగా ఈ నియామకం జరపాల్సి ఉంటుంది. ఈ నోటిఫికేషన్ వెలువరించడానికి ముందు, సామాజిక మాధ్యమ దుర్వినియోగంపై బాధితులు తమ ఫిర్యాదులను దాఖలు చేసేందుకు ఎలాంటి అవకాశం ఉండేది కాదు.

కొత్త ఐ.టి. నిబంధనల ప్రకారం నియమితుడైన పరిష్కార యంత్రాంగం అధికారి (గ్రీవెన్స్ ఆఫీసర్) ఎప్పటికప్పుడు ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించాల్సి ఉంటుంది. ఇలా తనకు చేరిన ఫిర్యాదుల వివరాలను సదరు అధికారి ప్రతినెలా ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది.

భారతీయ ప్రజాస్వామ్య విలువలు, సంప్రదాయాలు ఎంతో ఎంతో విస్తృతమైన గుర్తింపును కలిగి ఉన్నాయి. భారతీయ రాజ్యాంగం భావ ప్రకటనా స్వేచ్ఛకు పూర్తి హామీ ఇచ్చింది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయ పాలనా వ్యవస్థ, పటిష్టమైన సమాచార సాధనాల వ్యవస్థ కూడా భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతర్భాగాలే.

సామాజిక మాధ్యమాల్లో తొట్ట తొలుత సమాచారం పొందుపరిచిన వ్యక్తిని పసిగట్టేందుకు కొత్త ఐ.టి. నిబంధనల ప్రకారం పరిమిత సమాచారం మాత్రమే అవసరమవుతుందని గమనించాలి. ఇప్పటికే బహిరంగ చలామణీలో ఉన్న సమాచారం, లేదా సందేశం హింసాకాండను ప్రేరేపించేలా, దేశ సమైక్యత, సమగ్రతలకు భంగం కలిగించేలా ఉన్నా, మహిళలను కించపరిచేలా ఉన్నా, చిన్నపిల్లలను లైంగికంగా వేధించేలా ఉన్నా, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలేవీ పనిచేయనప్పుడు సదరు సందేశాలను మొదటగా ఎవరు పొందుపరిచారన్న సమాచారం తెలుసుకోవడానికి సామాజిక మాధ్యమాల్లో మధ్యవర్తుల అవసరం ఏర్పడుతుంది.

అయితే, భారీ సంఖ్యలో ఫిర్యాదులను దాఖలు చేయడానికి కొత్త ఐ.టి. నిబంధనలు దుర్వినియోగం కావచ్చుని, దీనితో సామాజిక మాధ్యమాల్లో ఏర్పాటు చేసే పరిష్కార యంత్రాంగాలు ఫిర్యాదులతో వెల్లువెత్తువచ్చని వచ్చిన ఆందోళనలు కూడా సరైనవికావు. ఈ ఆందోళనలు అతిశయోక్తితో కూడుకున్నవేగానీ, సిసలైనవి కానే కాదు.

కె.ఎస్. పుట్టుస్వామి కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం వ్యక్తిగత రహస్యాల హక్కును ప్రభుత్వం పూర్తిగా గుర్తిస్తోంది. ఆ హక్కును సముచితంగా గౌరవిస్తోంది. వ్యక్తి అస్తిత్వం విషయంలో కీలక పాత్ర వహించేది వ్యక్తిగత రహస్య హక్కు. ఈ నేపథ్యంలో కొత్త ఐ.టి. నిబంధనల ప్రకారం కేవలం చలామణీలో ఉన్న సందేశానికి సంబంధించిన సమాచారాన్ని మాత్రమే తెలుసుకోవలసి ఉంటుంది. ఐ.టి. చట్టంలోని చట్టబద్ధమైన అధికారాలను వినియోగించడంలో భాగంగానే ఈ నిబంధనలకు రూపకల్పన జరిగింది.

# ఏప్రిల్ నెలలో ఈ.పి.ఎఫ్.ఓ. 12.76 లక్షల నికర చందాదారులు

న్యూఢిల్లీ, జూన్ 21:2021 ఏప్రిల్ నెలలో ఈ.పి.ఎఫ్.ఓ. సుమారు 12.76 లక్షల నికర చందాదారులను చేర్చిన విషయాన్ని, 2021 జూన్, 20వ తేదీన ప్రచురించబడిన ఈ.పి.ఎఫ్.ఓ. తాత్కాలిక పేరోల్ డేటా ద్వారా, వెల్లడయింది. కోవిడ్–19 మహమ్మారి రెండవ దశ కొనసాగుతున్నప్పటికీ, 2021 ఏప్రిల్ నెలలో, 13.73 శాతం నికర చందాదారుల పెరుగుదల నమోదైంది, అంతకుముందు నెలతో పోలిస్తే, 2021 ఏప్రిల్ నెలలో, 11.22 లక్షల మేర నికర చందాదారులు పేరోల్ కు చేర్చబడ్డారు. 2021 ఏప్రిల్ నెలలో నిష్క్రమణ ల సంఖ్య 87,821 మేర తగ్గగా, 2021 మార్చి నెలతో పోలిస్తే తిరిగి చేరిన సభ్యుల సంఖ్య 92,864 మేర పెరిగినట్లు, డేటా వివరాలు తెలియజేస్తున్నాయి.

ఈ నెలలో చేరిన 12.76 లక్షల నికర చందాదారులలో, 6.89 లక్షల మంది కొత్త సభ్యులు, మొదటిసారి, ఈ.పి.ఎఫ్.ఓ. కి చెందిన సామాజిక భద్రత పరిధిలోకి వచ్చారు. సుమారు 5.86 లక్షల మంది నికర చందాదారులు ఈ.పి.ఎఫ్.ఓ. నుండి నిష్క్రమించి, తరువాత ఈ.పి.ఎఫ్.ఓ. పరిధిలోని సంస్థల్లో ఉద్యోగాల్లో చేరడం ద్వారా ఈ.పి.ఎఫ్.ఓ. పరిధిలోకి తిరిగి వచ్చారు. వీరు తుది పరిష్కారం కోసం ఎంచుకోవడం కంటే నిధుల బదిలీ ద్వారా సభ్యత్వాన్ని నిలుపుకోవటానికి ఎంచుకున్నారు.

పే రోల్ డేటాను వయస్సు వారీగా పోల్చి చూస్తే, 22–25 సంవత్సరాల మధ్య వయస్సు వారు 2021 ఏప్రిల్ నెలలో అత్యధిక సంఖ్యలో సుమారు 3.27 లక్షల మంది సభ్యులు కొత్తగా నమోదైనట్లు తెలుస్తోంది. ఆ తర్వాత, 29–35 మధ్య వయస్సు గలవారు 2.72 లక్షల మంది సభ్యులుగా నమోదయ్యారు. 18–25 మధ్య వయస్సు గల వారు, సాధారణంగా ఉద్యోగంలో మొదటి సారి చేరినవారై ఉంటారు. 2021 ఏప్రిల్ నెలలో చేరిన మొత్తం నికర చందాదారులలో వీరు 43.35 శాతంగా ఉన్నారు.

పే రోల్ గణాంకాల వివరాలను రాష్ట్రాల వారీగా పోల్చి చూస్తే, మహారాష్ట్ర, హర్యానా, గుజరాత్, తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సంస్థలు, ఈ నెలలో సుమారు 7.58 లక్షల మంది సభ్యులను చేర్చుకోవడం ద్వారా ముందంజలో ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో అన్ని వయసుల వారి మొత్తం నికర పే రోల్ చేరిక 59.41 శాతంగా నమోదయ్యింది. గత నెలతో పోల్చితే ఈశాన్య (ఎన్.ఈ) రాష్ట్రాలు, నికర చందాదారుల చేరికలో సగటు వృద్ధిని నమోదు చేశాయి.

స్త్రీ, పురుషుల వారీగా పోల్చి చూస్తే, ఈ నెలలో చేరిన మహిళా సభ్యుల సంఖ్య, మొత్తం నికర చందాదారుల సంఖ్యలో, సుమారు 22 శాతంగా నమోదయ్యింది. 2021 ఏప్రిల్ నెలలో 2.81 లక్షల మంది మహిళా సభ్యులు చేరడంతో, నికర మహిళా చందాదారుల సంఖ్యలో పెరుగుతున్న ధోరణి, నెలవారీ విశ్లేషణలో వెల్లడయ్యింది. 2021 మార్చి నెలలో వీరి సంఖ్య 2.42 లక్షలుగా నమోదయ్యింది. అదేవిధంగా, మొదటిసారి ఈ.పి.ఎఫ్.ఓ. పరిధిలోకి వచ్చిన మహిళా చందాదారుల సంఖ్య కూడా, 2021 మార్చి నెలలో 1.84 లక్షలు గా ఉండగా, 2021 ఏప్రిల్ నెలలో ఈ సంఖ్య 1.90 లక్షలకు పెరిగింది.

ఈ నెలలో చేరిన మొత్తం చందాదారులలో, 'నిపుణుల సేవలు' విభాగానికి చెందిన (మానవ వనరుల ఏజెన్సీలు, ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు, చిన్న కాంట్రాక్టర్లు మొదలైన వాటికి చెందిన) ఉద్యోగులు, 45 శాతం మంది ఉన్నట్లు, పరిశ్రమల వారీగా విశ్లేషించిన, పేరోల్ వివరాలు, వెల్లడించాయి. ఇదే విధంగా, ప్లాస్టిక్ ఉత్పత్తులు, బీడీలు తయారు చేసే సంస్థలు, పాఠశాలలు, బ్యాంకులతో పాటు, ఇనుము మరియు ఉక్కు రంగాలకు సంబంధించిన సంస్థలు, పరిశ్రమల్లో కూడా, గత నెల అంటే, 2021 మార్చి నెలతో పోలిస్తే, 2021 ఏప్రిల్ నెలలో చేరిన నికర చందాదారుల సంఖ్య, సగటు వృద్ధి కంటే ఎక్కువగా నమోదయ్యింది.

పే రోల్ డేటా తాత్కాలికం ఎందుకంటే ఉద్యోగుల రికార్డుల నవీకరణ నిరంతర ప్రక్రియ కాబట్టి డేటా ఉత్పత్తి నిరంతర వ్యాయామం. మునుపటి డేటా ప్రతి నెలా నవీకరించబడుతుంది. 2017 సెప్టెంబర్ నుంచి మొత్తం పే రోల్ డేటా ను, ఈ.పి.ఎఫ్.ఓ., ఏప్రిల్, 2018 నుంచి క్రమం తప్పకుండా విడుదల చేస్తోంది.

# అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకున్న పొసొకో




హైదరాబాద్ , జూన్ 21:విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని సిపిఎస్‌యు, భారతీయ గ్రిడ్ ఆపరేటర్ పొసొకో సోమవారం 7వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంది. ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 600 మంది ఉద్యోగులు వారి కుటుంబాలు ఇందులో పాలుపంచుకున్నారు. పవర్ సిస్టం ఆపరేషన్ కార్పొరేషన్ (పొసొకో) ఈ యోగా సెషన్ ను ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థతో కలిసి నిర్వహించింది. ఈ ఏడాది ఇతివృత్తమైన ఆరోగ్యం/ సంక్షేమం కోసం యోగ – వ్యక్తి భౌతిక మానసిక ఆరోగ్యం కోసం యోగసాధనపై దృష్టి కేంద్రీకరించింది.

ఈ సందర్భంగా పొసొకో సిఎండి కె.వి.ఎస్ బాబా సిబ్బందిని ఉద్దేశించి ప్రసం గిస్తూ, వారు, భౌతిక, మానసిక ఆరోగ్యాన్ని, సంక్షేమాన్ని కలిగించే యోగను ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులూ యోగను తమ నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. యోగ జీవ క్రియను మెరుగుపరచడమే కాక, సరైన రక్తాన్ని ప్రవాహాన్నినిర్వహించడమే కాక, శ్వాస సంబంధిత, తదితర సమస్యలను పరిష్క రించడంలో సాయపడుతుందని చెప్పారు. అది మానసిక ఆరోగ్యాన్ని, భావోద్వేగపరమైన సమతుల్యతను నిర్మించడమే కాక భయం, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలతో పోరాడేందుకు తోడ్పడుతుందన్నారు. గంటపాటు జరిగిన ఈ యోగ సెషన్ లో, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ నిపుణుడి సూచనల కు అనుగుణం అనేక యోగ ఆసనాలు, శ్వాసకు సంబంధించిన వ్యాయామాలు సహా ప్రాణాయామాన్ని సాధన చేశారు.

విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలో పూర్తి భారత ప్రభుత్వ యాజమాన్యంలో నడిచే సంస్థ పొసొకో. గ్రిడ్ సమగ్ర కార్యకలాపాలను నమ్మకమైన, సమర్థవంతమైన సురక్షిత రీతిలో నిర్వహించడం ఈ సంస్థ బాధ్యత. ఈ సంస్థ నిర్వహణలో ఐదు ప్రాంతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్లు, జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ ఉన్నాయి.

# దేశవ్యాప్త ఉమ్మడి యోగా ప్రోటోకాల్ ప్రదర్శనలో ఆన్‌లైన్ ద్వారా పాల్గొనడం ద్వారా ఏడవ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకున్న ఎన్‌హెచ్‌పీసీ



న్యూఢిల్లీ, జూన్ 21:భారతదేశ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి సంస్థ అయిన ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్; తన అన్ని విద్యుత్ కేంద్రాలు, ప్రాజెక్టులు, ప్రాంతీయ కార్యాలయాల్లో ఏడవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకుంది. కొవిడ్ దృష్ట్యా, ఎలక్ట్రానిక్, డిజిటల్ వేదికల ద్వారా యోగా వేడుకలు నిర్వహించారు.

ఎన్‌హెచ్‌పీసీ సీఎండీ శ్రీ ఏ.కె.సింగ్ తన కుటుంబ సభ్యులతో కలిసి సామూహిక ఆన్‌లైన్ యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. దూరదర్శన్ ద్వారా 'కామన్ యోగా ప్రొటోకాల్' ప్రదర్శన దేశవ్యాప్త ప్రత్యక్ష ప్రసారానికి సమకాలీనంగా ఈ కార్యక్రమం జరిగింది. ఎన్.కె.జైన్, డైరెక్టర్ (పర్సనల్), వై.కె.చౌబే, డైరెక్టర్ (ప్రాజెక్టులు), ఆర్.పి.గోయెల్, డైరెక్టర్ (ఫైనాన్స్), బిస్వజిత్ బసు, డైరెక్టర్ (ప్రాజెక్టులు), సీవీవో ఎ.కె.శ్రీవాస్తవ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆన్‌లైన్ యోగా కార్యక్రమంలో ఎన్‌హెచ్‌పీసీ ఉద్యోగులు, భద్రత సిబ్బంది, ఒప్పంద కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సహా వేల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ ఏ.కె.సింగ్ మాట్లాడుతూ, "ప్రజల్లో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని, ఆధ్యాత్మిక శక్తిని యోగా పెంపొందిస్తుంది. యోగా అభ్యసిస్తున్న వారంతా దానిని వదలకుండా కొనసాగించాలి. అభ్యాసన చేయనివారు యోగా నేర్చుకుని మానసిక, శరీరక ఆరోగ్యాన్ని పొందాలని విజ్ఞప్తి చేస్తున్నా. మనం చేసే పనులను యోగా సులభతరం చేస్తుంది, మనల్ని ఆరోగ్యంగా, సంతోషంగా ఉంచుతుంది" అని చెప్పారు.

ఎన్‌హెచ్‌పీసీ సీఎండీ ఏ.కె.సింగ్, తన భార్య శ్రీమతి సుధాసింగ్ కూడా ఏడవ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని యోగాసనాలు వేశారు.

వీడియో కాన్ఫరెన్స్ పద్ధతిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించడం వల్ల, ఎన్ని ప్రాంతాల్లో ఉన్న ఎన్‌హెచ్‌పీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాల్గొనగలిగారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా, వారం రోజులుగా, ఆన్‌లైన్ యోగా కార్యక్రమాలు, యోగా, ప్రకృతి వైద్యంపై ఉపన్యాసాలను ఎన్‌హెచ్‌పీసీ నిర్వహించింది.

# కొడుకును కాపాడబోయి తల్లి మృతి

నాగర్ కర్నూల్, జూన్ 21: జిల్లాలో విషాదంచోటు చేసుకుంది. ఆత్మహత్య చేసుకోబోయిన కొడుకును కాపాడే ప్రయత్నంలో ఓ తల్లి విదుదాఘాతానికి గురై తనువు చాలించింది. ఈ విషాదకర సంఘటన తిమ్మాజీపేట మండలం గుమ్మకొండ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కుటుంబ కలహాలతో కలత చెందిన రాములు అనే వ్యక్తి తమ ఇంటి సమీపంలోని ట్రాన్స్ ఫార్మర్ వద్దకు వెళ్లి కరెంట్ తీగలను పట్టుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

కాగా, రాములును కాపాడేందుకు ప్రయత్నించిన అతడి తల్లి అంతమ్మ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. రాములు, అతని కుమారుడు, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని జడ్చర్ల దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నిక్కత్ జరీన్‌ను సన్మానించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్ , జూన్ 21:నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ బాక్సింగ్ క్రీడాకారిణి నిక్కత్ జరీన్‌ను మంత్రి శ్రీనివాస్ గౌడ్ రవీంద్రభారతిలోని తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. నిక్కత్ జరీన్ కు స్పోర్ట్స్ కోటా కింద బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆఫీసర్ స్థాయి ఉద్యోగం కల్పించిన సందర్భంగా మంత్రి అభినందించారు. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన నిక్కత్ నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బాక్సింగ్ క్రీడలో అద్భుత ప్రదర్శన చేస్తున్నదని మంత్రి తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో క్రీడాకారులకు, క్రీడల అభివృద్ధి కి పెద్ద పీట వేస్తున్నామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన విధంగా ప్రోత్సాహకాలను, నగదు పురస్కారాలను గతంలో కంటే నేడు భారీగా అందిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ క్రీడల అభివృద్ధి కి నియమించిన క్యాబినెట్ సబ్ కమిటీ ద్వారా త్వరలోనే మంచి క్రీడా పాలసీని తయారుచేయబోతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి కేఎస్ శ్రీనివాస రాజు, ఛైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, సంగీత నాటక అకాడమి అధ్యక్షులు బాద్మి శివకుమార్, జయప్రకాష్ విద్యాసంస్థల ఛైర్మన్ రవికుమార్, నిక్కత్ జరీన్ తండ్రి జమీల్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న కేయూ విద్యార్థులు

వరంగల్,జూన్ 21:సీఎం కేసీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సీఎం కాన్వాయ్‌ను కేయూ జేఏసీ విద్యార్థులు అడ్డుకున్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ? కాన్వాయ్‌కు అడ్డుగా వెళ్లారు. 'కేసీఆర్ డౌన్‌డౌన్.. ఖబడ్దార్ కేసీఆర్' నినాదాలతో హోరెత్తించారు. వెంటనే తేరుకున్న పోలీసులు.. విద్యార్థులను అరెస్ట్ చేశారు. వరంగల్ కలెక్టరేట్ ప్రారంభానికి సీఎం కేసీఆర్ వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

పోలీసులు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టినా.. విద్యార్థులు రావడం చర్చనీయాంశమైంది. కేయూ విద్యార్థి సూసైడ్ చేసుకున్న ఘటనతో ఇప్పటికే విద్యార్థులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పర్యటనలో అవాంఛనీయ ఘటనల జరగొచ్చన్న ఉద్దేశంతో పోలీసులు కూడా అప్రమత్తంగా ఉన్నారు. అన్ని సంఘాల విద్యార్థి నాయకులను ముందస్తు హౌజ్ అరెస్ట్ చేశారు. అయినా విద్యార్థులు కాన్వాయ్‌ను అడ్డుకోవడం సంచలనంగా మారింది. గతంలో రాష్ట్ర మంత్రి కేటీఆర్ వచ్చినప్పుడు కూడా విద్యార్థులు ఇదే విధంగా అడ్డుకున్నారు. అడుగడుగునా అవాంతరాలు సృష్టించారు.

# కరోనా కట్టడికి 'యోగా'స్త్రం ప్రయోగిద్దాం

## (21 జూన్ 'అంతర్జాతయ యోగా దినం' సందర్భంగా)

27 సెప్టెంబర్ 2014న ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశంలో మన ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ భారత సనాతన పతంజలి యోగా సాధన క్రియలతో ప్రపంచ మానవాళికి ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని 177 దేశాల ప్రతినిధుల సమక్షంలో సగర్వంగా వివరించారు. యోగాతో ప్రకృతికి, మానవజాతికి మధ్య సామరస్యం నెలకొంటుందనే భారతీయ రుషి బోధనలను అర్థం చేసుకున్న ఐరాస 21 జూన్ 2015 నుంచి 'అంతర్జాతీయ యోగా దినం' నిర్వహించేందుకు ఏకగ్రీవంగా అమోదించడం భారతీయులందరికీ గర్వకారణమైంది. ఈ ఏడాది కరోనా విజృంభన నేపథ్యంలో అంతర్జాతీయ యోగా దినం-2021 నినాదంగా 'ఆరోగ్యసౌభాగ్యాలకు యోగా (యోగా ఫర్ వెల్‌బీయింగ్)' అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. యోగా ఒక శారీరక వ్యాయామమే కాదని కోవిడ్-19 కట్టడిలో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసం అత్యవసరమని గ్రహించి యోగా సాధన చేస్తూ వ్యాధినిరోధకశక్తిని పెంచుకోవాలని సూచిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలతో ప్రపంచ దేశాలు యోగా క్రియలను అభ్యాసం చేయాలని, 2018-2030 ప్రణాళిక ప్రకారంతో యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రపంచ కార్య ప్రణాళిక (గ్లోబల్ ఆక్షన్ ప్లాన్)' ద్వారా సందేశాన్ని అందించారు. శరీరం, మనసు ఏకీకరణకు యోగా సరైన మార్గమని తెలుసుకోవాలి. మానసిక ప్రశాంతత, శారీరక పటుత్వం, ఆరోగ్యసౌభాగ్య స్థిరత్వాల సాధనకు యోగా క్రియలు నిర్ధేశించబడ్డాయని తెలుసుకోవాలి.

కరోనా రెండవ అల తగ్గుముఖం పట్టిందనే సూచనలు సంతోషాన్ని కలిగిస్తున్నప్పటికీ 3వ అల ఆగష్టు తరువాత రావచ్చనే నిపుణుల హెచ్చరికల నడుమ మన ఆరోగ్య పరిరక్షణకు యోగాస్త్రం అత్యంత ప్రభావితంగల వ్యాక్సిన్ వలె పని చేస్తుందని గమనించాలి. దేశంలో కరోనా రెండవ అల సునామి మహావిపత్తులో నేటికీ రోజుకు ఒక లక్షలోపు కేసులు మరియు 3 వేల వరకు మరణాలతో అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేస్తున్నది. మనిషిని చూస్తే మానవ బాంబును చూసినట్లు భయం, గాలి పీల్చితే ఊపిరి ఆగినంత అనుభవం, కరోనా సోకడం కన్న కోవిడ్-19కు భీతిల్లి ప్రాణాలు కోల్పోయేంత పని అయ్యింది. కరోనా పరీక్షా కిట్లు, ఆసుపత్రుల్లో బెడ్లు, ప్రాణవాయువు సిలిండర్లు, కోవిడ్-19 ఔషధాల కొరతతో రోగులు శ్వాస తీసుకునేందుకు తంటాలు పడ్డారు. ఈ భయానక మరణమృదంగ సమయాన ఏ మార్గం తీసుకోవాలో, ఏ జాగ్రత్తలు పాటించాలో, ఏ ఔషధాలు/పోషకాహారం తినాలో స్పష్టత లేక చావు బతుకుల మధ్య నేటికీ కొట్టుమిట్టాడుతున్నారు. ఇలాంటి కరోనా కల్లోల అకాలంలో దేశ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యానికి, ఉత్తమ వ్యాధి నిరోధక శక్తికి ఏకైక ఉత్తమ మార్గంగా పతంజలి ప్రవేశ పెట్టిన భారతీయ సనాతన ఆధ్యాత్మిక యోగా ప్రాణాయామాలు కరోనా సోకకుండా రక్షక కవచాలుగా పని చేస్తున్నాయని యోగా గురువులు బోధిస్తున్నారు. ఒంటరితనం, భయం, మానసిక ఒత్తిడి లాంటి అవలక్షణాలను ఎదురించడానికి కావలసిన ఆధ్యాత్మిక 'యోగా టీకాస్త్రం' ప్రయోగించేందుకు ముందుకు రావాలని యోగా సాధకులు కోరుతున్నారు. ఈ క్రమంలో సమత్ వాయు, సింహ క్రియ, షాష్టాంగ, ఇషా క్రియ లాంటి అభ్యాసాలు మనల్ని బలవంతులుగా, ధైర్యస్థులుగా, పాజిటివ్ దృక్పథంతో కరోనా నెగెటివ్ స్థాయికి ఎదుగుతారు. 'యోగాస్త్రం' శరీరానికి ఓ దివ్యఔషధం. యోగా సాధనతో శారీరక మానసిక ధృఢత్వం, ఆక్సీజన్ నిండిన రక్తం, సక్రమ శ్వాస, సమతుల హార్మోన్ల విడుదల, యవ్వన ఛాయ, సమతుల్యతగల కొవ్వు నిల్వలు, కంటి ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి పెరగడం, సజావుగా జీర్ణక్రియ, శరీరం తేలిక కావడం, ఏకాగ్రత పెరగడం, భావోద్వేగ నియంత్రణ, స్వీయ క్రమశిక్షణ, ధైర్యం పెరగడం, ఆనందంగా జీవించడంల లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. దీని వల్లనే కరోనా లాంటి ఎలాంటి వైరస్‌లు సోకకుండా శరీరం తట్టుకుంటుందని గుర్తు చేస్తున్నారు.

కరోనా పరీక్షలు నెగెటివ్ రావాలంటే మానసిక స్థిరత్వం పాజిటివ్‌గా ఉండాలని నమ్మాలి. యోగా సాధన 'జీవన రక్షకు ఉపకరణం'గా పని చేస్తుంది. అనునిత్యం క్రమం తప్పకుండా యోగా సాధనతో అంతరికశక్తి ఉత్తేజితమై ఎలాంటి వైరస్‌లు సోకకుండా రక్షణ కవచంగా పని చేస్తుంది. వ్యక్తి వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి యోగా శాస్త్ర సాధన ఉపయోగ పడుతుంది. ఉచితంగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న యోగా క్రియల సాధనతో శక్తి ప్రేరణ, ఇమ్యునిటీ, బలం, ప్రాణవాయు శోషణ సామర్థ్యం, మానసిక ఆరోగ్యాలు సిద్ధిస్తున్నాయని నమ్మాలి. కరోనా వ్యాప్తి మానవాళికి మరువలేని గుణపాఠం నేర్పింది. ప్రభుత్వం అందిస్తున్న టీకాలను తీసుకుంటూనే, మన ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు యోగాస్త్రాన్ని వాడుకుంటూ, 'యోగా వీరులు'గా మరియు 'ఆధ్యాత్మిక యోధులు'గా మార్చడానికి ప్రయత్నించాలి. నిర్మలంగా ఉంటూ, సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ముందుకు అడుగులు వేయడమే యోధుల లక్షణం. ఇతరుల ప్రవర్తనను మనం మార్చలేం. మన సత్ప్రవర్తన, అవసర జాగ్రత్తలు మాత్రమే మన చేతుల్లో ఉందని మరువరాదు. మనసు సంతోష సంద్రంలో తేలియాడినపుడు శారీరక వ్యవస్థలు ఉత్తేజితం అవుతూ, మానసిక బలహీనతలను దూరం చేస్తాయని తెలుసుకోవాలి. స్వీయ నియంత్రణకు యోగా సాధన అతి ముఖ్యమైనదని, ఆవేశాన్ని తుడిచేసి సదాలోచనలను నిలుపుతుందని తెలుసు కోవాలి. కరోనాకు విరుగుడుగా 'ఆధ్యాత్మిక టీకా' లేదా 'యోగాస్త్ర టీకా సురక్ష'ను పొందుదాం, ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఎల్లుండి నుంచి అందుబాటులోకి ఎంఎంటీఎస్ రైళ్లు

హైదరాబాద్ , జూన్ 21: ఈ నెల 23 నుంచి హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ రైళ్లను పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. దాదాపు 15 నెలల తర్వాత ఎంఎంటీఎస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కరోనా మహమ్మారి కారణంగా గతేడాది మార్చి 23న ఎంఎంటీఎస్ రైళ్ల సేవలు నిలిచిపోయాయి. ముందుగా 10 ఎంఎంటీఎస్ రైళ్లను నడపనున్నారు. క్రమంగా ఎంఎంటీఎస్ సర్వీసులను పెంచనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు.

# బెంగాల్ ఫలితాల తర్వాత వేలాది మంది గ్రామాలను వీడుతున్నారు: స్మృతి ఇరానీ

న్యూఢిల్లీ, జూన్ 21: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో తొలిసారి వేలాది మంది ప్రజలు తమ ఇళ్లను, గ్రామాలను విడిచిపెట్టి సరిహద్దు దాటుతున్నారని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఆరోపించారు. తమను క్షమించాలని మమతా బెనర్జీ, టీఎంసీని వేడుకుంటు న్నారని, మతం మరేందుకు కూడా సిద్ధమని చెబుతున్నారని విమర్శించారు. మహిళలను ఇండ్ల నుంచి బలవంతంగా తీసుకెళ్లి బహిరంగ లైంగికదాడికి పాల్పడుతున్నారని స్మృతి ఇరానీ ఆరోపించారు. దళిత లేదా గిరిజన మహిళలను కూడా వదిలిపెట్టడం లేదని విమర్శించారు.

ఆరేండ్ల మనువడి ముందు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ 60 ఏండ్ల మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించిందని స్మృతి ఇరానీ తెలిపారు. బీజేపీ కార్యకర్త కావడం వల్లనే ఆమెపై ఈ దారుణానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఇంకా ఎంత మంది మహిళలు ఇలాంటి దారుణాలను మౌనంగా భరించాలి అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రుల కార్లపై రాళ్ల దాడి జరుగుతున్నప్పుడు వారి రాష్ట్రంలో సామాన్యులు సురక్షితంగా ఉన్నారా? అని మానవ హక్కుల కార్యకర్తలుగా చెప్పుకునే వారిని తాను ప్రశ్నించాలనుకుంటున్నానని అన్నారు. అత్యాచారానికి గురైన మహిళల కోసం ప్రెస్ క్లబ్ ముందు ఎందుకు నిరసన తెలుపలేదు అని స్మృతి ఇరానీ ప్రశ్నించారు.

# ప్రధాని మోదీ కృషితో యోగాకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు

## –బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జమాల్

కరీంనగర్ జూన్ 21(నేటినిజం ప్రతినిధి): భారత ప్రధాని నరేంద్ర మోదీ కృషితోనే యోగా కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జమాల్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బిజెపి రాష్ట్ర రథ సారథి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు నగరంలోని సుమంగళి గార్డెన్ లో నగర సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా జమాల్ మాట్లాడుతూ యోగాకు ప్రపంచ వ్యాప్తంగా మంచి ఆచరణాత్మక ఆదరణ లభిస్తోందన్నారు. మనిషి జీవితంలో యోగా భాగస్వామ్యం అయిందన్నారు.

యోగాకు ఇంతటి ప్రాచుర్యం కల్పించడంలో బిజెపి ప్రభుత్వం అలుపెరుగని కృషి చేసిందన్నారు. ఈకార్యక్రమంలో సెంట్రల్ జోన్ కార్యదర్శి తనకు సాయి కృష్ణ, దేవిశెట్టి నవీన్ కుమార్, బొడ్ల శ్రీరాములు, కలికోట మోహన్ లు పాల్గొన్నారు. పతంజలి యోగ సమితి జిల్లా



అధ్యక్షులు బూర్ల లక్ష్మీనారాయణ గారి ఆధ్వర్యలో జరిగిన ఈ కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, సంధ్యారెడ్డి,రాకం వేణుగోపాల్, రాకం పద్మావతి,శ్యామల, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# మతానికి అతీతంగా మానవత్వానికి చిరునామాగా జమాతే ఇస్లామిక్ హింద్ సేవలు ప్రశంసనీయం

## 30 రోజుల నుండి కొనసాగుతున్న జమాతే ఇస్లామిక్ హింద్ సేవలు

## -ప్రభుత్వ ఆసుపత్రిలో-కరోనా పేషంట్లకు, వైద్య సిబ్బందికి ఆహారం, పండ్ల పంపిణీ.

కరీంనగర్ జూన్ 21(నేటినిజం ప్రతినిధి): భుత్వ ప్రధాన హాస్పిటల్లో "జమాతే ఇస్లామిక్ హింద్" వారి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హాస్పిటల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి ఆహారం, పండ్లు, వాటర్ బాటిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య ఆహ్వానితులుగా హాజరైన ముఖ్య అతిథులు డాక్టర్.సౌరయ్యా నెలపతి ఆర్ ఎం ఓ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ లు అలిం ఉద్దీన్, సభిహ తబస్సుం, వసీం, మధుసూదన్ రాజు, ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టర్ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్లామిక్ హింద్ స్వచ్ఛంద సంస్థ వారు మానవత్వ దృక్పథంతో అంది స్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. మతానికి అతీతంగా మానవత్వానికి చిరునామాగా జమాతే ఇస్లామిక్ హింద్ సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

ప్రస్తుత కరోనా పరిస్థితుల్లో కరోనా పేషంట్లకు, వైద్య సిబ్బందికి గత 30వ.



రోజుల నుండి సాయంత్రం భోజనము, పండ్లు, వాటర్ బాటిళ్లు అందించడం గొప్ప విషయమని అన్నారు. అంతేగాక కోవిడ్ తో చనిపోయిన మృతుల అంత్యక్రియలకు వారి బంధు మిత్రులు ఎవ్వరు కూడా హాజరు కాని పరిస్థితులలో ఈ స్వచ్ఛంద సంస్థ వారు దగ్గరుండి దహన సంస్కారాలు చేయడం వారి మానవత్వ విలువలకు అద్దం పడుతోంది. మనుషులకు మానవత్వానికి మించిన కులం, మతం లేవన్నది వీరి సేవలకు నిదర్శనం. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామిక్ హింద్ అధ్యకులు,ఖైరుద్దీన్,ఉపాధ్యక్షుడు ఉమెర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన సింధోల్ రోడ్డు పనులు : మంత్రి హరీశ్ రావు



సంగారెడ్డి,జూన్ 21:: తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం పని చేస్తున్నదని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సోమవారం రేగోడ్ మండలం సిందోల్ గ్రామ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం సిందోల్ రోడ్డు పనులకు ప్రత్యేక జీవో ద్వారా రూ.2.25 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రోడ్డు నిర్మాణంతో సిందోల్ గ్రామ ప్రజల ఇక్కట్లు తీరుతాయని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన మూడు నెలల లోపు రోడ్డు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని పంచాయతీరాజ్ ఎస్ఈని ఆదేశించారు.

కరోనాతో రాష్ట్ర ఆదాయం తగ్గినా రైతులకు సంబంధించిన ఏ సంక్షేమ పథకాన్ని ఆపలేదన్నారు.

వానకాలం రైతుబంధు కింద ఈ రోజు వరకు 7 ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతుబంధు డబ్బులు వారి ఖాతాలో జమ చేసామన్నారు. 57 లక్షల 60 వేల 608 మంది రైతులకు రూ.6,012 కోట్ల 72 లక్షలు రైతుల ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలన్నారు. వానకాలం మొక్కజొన్న సాగుకు బదులుగా పత్తి, కంది సాగును చేయాలని సూచించారు. కంది, పత్తి పంటకు మంచి మద్దతు ధర వచ్చేలా చూస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ఒక్కొక్కటిగా అన్ని సౌకర్యాలను కల్పిస్తుందన్నారు.

ప్రభుత్వం త్వరలో ఎస్సీ నిరుద్యోగ యువత కోసం రూ. 1000 కోట్లతో దళిత్ ఎంపవర్మెంట్ స్కీమ్ ను ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం కులం, మతం, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, అదనపు కలెక్టర్ రాజర్షి షా, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నా

# పిల్లలకు సంగీత శక్తి అందించేందుకు ప్రముఖ సంగీత కళాకారులను ఒక్కదగ్గరకు చేర్చుతున్న సోని ఏయ్!




హైదరాబాద్ , జూన్ 21: పిల్లల జీవితాల్లో ఆశ, స్ఫూర్తిదాయకమైన సానుకూల దృక్పథాన్ని పెంపొందించడంలో సంగీతానికి ఉన్న శక్తి కీలక పాత్ర పోషించగలదు. ఈ లక్ష్యంతో ఈ ప్రపంచ సంగీత దినోత్సవం రోజున ప్రఖ్యాత పిల్లల ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెల్ సోనీ ఏయ్! పిల్లలను సంగీతానికి చేరువ చేసే తన సంప్రదాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్తోంది. రేఖ భరద్వాజ్, శంకర్-ఎహసాన్-లాయ్, విశాల్ దద్లాణి, షాన్, సునీతా రావ్ వంటి దేశంలోని ప్రముఖ సంగీత కళాకారులు ఆటోగ్రాఫ్ చేసిన సంగీత పరికరాలను విరాళంగా అందజేస్తోంది. సాధారణంగా అయితే ఇవి చూసేందుకు కూడా పిల్లలకు అనుమతి ఉండదు. సంగీతకళాకారులు జోడికట్టి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తమ సంగీత ప్రయాణాన్ని పిల్లలు ప్రారంభించేందుకు దోహదపడనున్నారు.

ససురాల్ గెందా ఫూల్ వంటి ట్యూన్ అందించిన భారత సంగీత పరిశ్రమకు చెందిన రేఖ భరద్వాజ్ ఈ ప్రయత్నం కోసం తన డిజిటల్ రాగిణిని విరాళంగా అందజేశారు. అలాగే హిందీ చిత్రపరిశ్రమకు చెందిన సంగీతత్రయం శంకర్, ఎహసాన్-లాయ్ తాము ఆటోగ్రాఫ్ చేసిన యుకులెలె, క్లాప్ బాక్స్, గిటార్ అందజేశారు. అద్భుతమైన రొమాంటిక్ ట్యూన్స్‌కు పెట్టింది పేరైన షాన్ తాను సంతకం చేసిన మ్యాండలిన్ పిల్లల కోసం విరాళంగా ఇచ్చారు. ఇక 90ల మ్యూజిక్ ట్రెండింగ్‌లో ఉంది కాబట్టి ఆనాటి స్వరాల వీణ సునీతా రావ్ బొంగో డ్రమ్‌పై సంతకం చేసి తన చేయూతను చాటిచెప్పారు. లీనా లెలె దత్తా, బిజినెస్ హెడ్, సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా, కిడ్స్ జోనర్! "పిల్లలకు ఇదొక కఠిన సంవత్సరం. ప్రశాంతత అందించేందుకు సాంత్వన చేకూర్చేందుకు, సవాళ్లను పిల్లలు అధిగమించి వారికి సాధికారత కల్పించేందుకు సంగీతం తన వినోదపు హద్దులు దాటి వెళ్తుందని అని ఆమె కృతజ్ఞతలు తెలిపారు. షాన్ః "నా కెరీర్ అసాంతం సంగీతం నాకు ఎన్నో అమూల్యమైన జీవితపాఠాలు నేర్పింది. సహనం, కష్టించడం నాకు అలవాటు చేసింది. ఈ ప్రపంచ సంగీత దినోత్సవం రోజున ప్రపంచవ్యాప్తంగా ఉన్న పిల్లలందరు పట్టుదలకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి కఠినశ్రమకు ఉన్న విలువను అందిపుచ్చుకోవాలని నేను ఆకాంక్షిస్తున్నాను. సోని ఏయ్! చేపట్టిన ఈ చర్య పిల్లల జీవితాల్లో స్ఫూర్తిని తీసుకువస్తుందని భావిస్తున్నాను అని షాన్ వివరించారు. శంకర్ మహాదేవన్ ప్రతీ ఒక్కరికీ ఇది క్లిష్టసమయం. అంతా ఇళ్లలో ఏకాంతంగా సమయం గడుపుతున్న పరిస్థితి. ఇంట్లోనే ఉంటున్నాం కాబట్టి మన దగ్గర చాలా సమయం ఉంటుంది. అందులో కొంత సమయాన్ని సంగీతమనే అద్భుతం కోసం కేటాయించాలి అని అన్నారు.

# ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు

రాజన్న సిరిసిల్ల, జూన్ 21(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం గుర్రం వారి పల్లెల్లో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో పూలమొక్కలను వేములవాడ అర్బన్ ఎంపీపీ బూర్ర వజ్రమ్మ బాబు నాటారు . ఈ సందర్భంగా ఎంపీపీ బూర్ర వజ్రమ్మ బాబు మాట్లాడుతూ యోగ ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ప్రతి రోజు యువతి యువకులు యోగ ఆసనాలు, ప్రాణాయామ క్రియలు చేయడం వలన ఆసనాలతో శరీరానికి,



ప్రాణాయామలతో మనసుకు ఎంతో ప్రశాంతతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చుఅన్నారు కావున మండలములోని అందరు యోగ ప్రతిరోజూ చేసి ఆరోగ్యాంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ మ్యాకల రవి వైస్ ఎంపీపీ ఆర్సిరావు ,స్థానిక సర్పంచ్ లక్ష్మణ్ రెడ్డి,ఎంపీడీవో నరేష్ ఆనంద్ ఎంపీ ఓ ,కార్యదర్శి వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# జయశంకర్ సార్ చరిత్రలో నిలిచిపోతారు



ఖమ్మం, జూన్ 21: : తెలంగాణ స్వయం పాలనా స్వాప్నికుడు, స్వరాష్ట్రం కోసం సాగిన ఉద్యమాల్లో భావజాల వ్యాప్తికి తన జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ చరిత్రలో చిరకాలం నిలిచిపోతారని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. సార్ వర్ధంతి సందర్భంగా ఖమ్మం కార్పొరేషన్ 16వ డివిజన్ కొత్తూర్ సర్కిల్లో గల సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారిని స్మరించుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలకు తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్రంలో సబ్బండ వర్గాలు స్వయం సమృద్ధిని సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ఒక్కొక్క రంగాన్ని సరిదిద్దుకుంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను దేశంలోనే అగ్రభాగాన నిలిపారన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, సుడా చైర్మన్ విజయ్ కుమార్ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

# కశ్మీర్ సమస్య పరిష్కారమైతే.. అణ్వాయుధాలు అవసరం లేదు : ఇమ్రాన్ ఖాన్

ఇస్లామాబాద్, జూన్ 21: పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మరోసారి కశ్మీర్ సమస్యపై స్పందించారు. ఒకసారి కశ్మీర్ సమస్య పరిష్కారమైతే, అప్పుడు రెండు దేశాలు అణ్వాయుధాలను పెంచుకోవాల్సిన అవసరం ఉండదన్నారు. హెచ్‌బీవో జర్నలిస్టు జోనాథన్ స్వాన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ సమాధానం వెల్లడించారు. పాకిస్థాన్‌లో అత్యంత వేగంగా అణ్వాయుధాలను సమీకరిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ నివేదికలు చెబుతున్నాయని, ఎందుకు అలా జరుగుతున్నట్లు ఆ జర్నలిస్టు పాక్ ప్రధానిని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు బదులిస్తూ ఇంటెలిజెన్స్‌కు ఎక్కడ నుంచి సమాచారం వస్తుందో తనకు తెలియదని, పాకిస్థాన్ అణ్వాయుధాలు కేవలం రక్షణ కోసం మాత్రమే అన్నారు. అణ్వాయుధాలు పెరుగుతున్నాయన సంఖ్య తనకు తెలియదన్నారు.

అణ్వాయుధాలకు తాను వ్యతిరేకమని, ఇండియాతో మూడు సార్లు యుద్ధం జరిగిందని, అణ్వాయుధ సామర్థ్యం పెరిగిన తర్వాత తమ మధ్య యుద్ధాలు జరగలేదని, కేవలం సరిహద్దు సమస్యలు మాత్రమే ఉన్నాయని ఇమ్రాన్ అన్నారు. ఒకసారి కశ్మీర్‌లో సెటిల్మెంట్ సమస్య తీరితే, అప్పుడు రెండు పొరుగు దేశాల్లోని ప్రజలు నాగరికుల్లా జీవిస్తారన్నారు. అప్పుడు అణ్వాయుధాలు అవసరం ఉండదని పాక్ ప్రధాని తెలిపారు. చైనాలో ఉయిగర్ ముస్లింపై జరుగుతున్న దాడులపై ప్రశ్నించగా.. ఆ అంశం గురించి డ్రాగన్ దేశంతో అంతర్గతంగా చర్చిస్తున్నట్లు వెల్లడించారు. ఉయిగర్లను వదిలేయండి.. కశ్మీర్‌లో లక్షల మంది చనిపోయారని, దాని గురించి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. అది ఎందుకు సమస్య కాదు అని ఇమ్రాన్ అడిగారు.

# ప్రత్యక్ష అమ్మకాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించిన ఐడీఎస్‌ఏ, షూలిని యూనివర్శిటీ

సోలన్, జూన్ 21 ః వినూత్నమైన కార్యక్రమంలో భాగంగా ఇండియన్ డైరెక్ట్ సెల్లింగ్ అసోసియేషన్ (ఐడీఎస్‌ఏ) మరియు షూలిని యూనివర్శిటీలు భాగస్వామ్యం చేసుకుని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డైరెక్ట్ సెల్లింగ్ ఇన్ అకడమిక్స్ (సీఈడీఎస్‌ఏ)ను ప్రారంభించాయి. 2021-22 విద్యాసంవత్సరం ఆరంభం నుంచి డైరెక్ట్ సేల్స్‌లో ఒక సంవత్సరం వ్యవధి కలిగిన పీజీ డిప్లొమాను ఇది అందిస్తుంది. ప్రత్యక్ష అమ్మకాల కోసం భారతదేశంలో మొట్టమొదటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గా సీఈడీఎస్‌ఏ నిలుస్తు ంది. ఈ కేంద్రాన్ని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖామాత్యులు గోవింద్ సింగ్ ఠాకూర్ మరియు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ఆహార, పౌర సరఫరా మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యుల రాజిందర్ గార్గ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షూలిని యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అతుల్ ఖోస్లా మాట్లాడుతూ పరిశ్రమ మరియు విద్యా సంస్థలు ఒకే దరికి వచ్చేందుకు చేస్తోన్న ప్రయత్నం అద్భుతమన్నారు. ఐడీఎస్‌ఏ ఛైర్‌పర్సన్ రిని సన్యాల్ మాట్లాడుతూ "దేశంలో ప్రత్యక్ష విక్రయ వ్యవస్థలో నూతన అధ్యాయాన్ని సీఈడీఎస్‌ఏ తెరువనుంది. ఇతర విద్యాసంస్థలు సైతం ప్రత్యక్ష విక్రయ వ్యాపార నమూనాలో అవసరమైన విద్యను అందించడానికి ముందుకు వస్తాయని ఆశిస్తున్నాము. భారతదేశంలో ప్రత్యక్ష విక్రయాలకు సంబంధించి పరిశోధనా ఇన్‌క్యుబేటర్‌గా సీఈడీఎస్‌ఏ సేవలనందించనుంది" అని అన్నారు. సోలన్‌లో అత్యంత అందమైన యూనివర్శిటీ క్యాంపస్ ఆధారంగా, ప్రపంచంలో డైరెక్ట్ సెల్లింగ్ బిజినెస్‌కు అంకితమైన రెండవ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇది. మొదటిది యుఎస్‌లో ఉన్నటువంటి డీఎస్ఈఎఫ్. అలాగే సీఈడీఎస్‌ఏ, ఐడీఎస్‌ఏ ఆవిష్కరణ తరువాత ప్రపంచంలో రెండవ డైరెక్ట్ సెల్లింగ్ అసోసియేషన్‌గానూ నిలువడంతో పాటుగా డిప్లొమో కోర్సులను అందిస్తున్న రెండవ సంస్థగానూ నిలిచింది.

# సింహ వాహనంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి?

తిరుపతి, జూన్ 21: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన సోమవారం స్వామివారు యోగ నరసింహుని అలంకారంలో చిన్నశేష వాహనంపై దర్శనమిచ్చారు. కోవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో ఆలయంలో ఏకాంతంగా వాహనసేవలు నిర్వహించారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. సింహ రూప దర్శనంతో అయా శక్తులన్నీ చైతన్యవంతమవుతాయి. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేను, నా వాహనమైన సింహమూ సమాన ప్రయత్నంతో ఉంటామని ఈ సింహవాహనోత్సవం ద్వారా స్వామివారు చెబుతున్నారు. ఈరోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ముత్యపుపందిరి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారు దర్శనమివ్వనున్నారు.

# టీఎస్ ఎంసెట్ తేదీలు ఖరారు

హైదరాబాద్ , జూన్ 21: టీఎస్ ఎంసెట్ తేదీలు ఖరారు అయ్యాయి. ఆగస్టు 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజుల పాటు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) మోడ్‌లో నిర్వహించనున్నారు. ఆగస్టు 3న ఈసెట్, ఆగస్టు 11 నుంచి 14వ తేదీ వరకు పీజీ ఈసెట్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఇక జులై 1వ తేదీ నుంచి డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కోర్సులకు ప్రత్యక్ష తరగతులు ప్రారంభం కానున్నాయి.ఎంసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు మరోసారి పొడిగించిన విషయం తెలిసిందే. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 24 వరకు ఎంసెట్ దరఖాస్తుల స్వీకరించనున్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com